సూర్య 18వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఆదివారం | 12 జనవరి 2025 | విజయవాడ
సంపుటి 18 | సంచిక 82
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, పుష్యమి మాసం శుద్ధ చతుర్దశి తె.4.55 వరకు, మృగశిర ఉ.11.31, వర్జ్యం రా.7.43 నుంచి 9.17 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.07 నుంచి 5.51 వరకు

## ఆప్-దా నుంచి ఫిబ్రవరి 5న విముక్తి

### 'జుగ్గి బస్తీ ప్రధాన్ సమ్మేళన్"లో అమిత్‌షా



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'ఆప్'ను విపత్తు (ఆప్-దా)గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించినప్పటి నుంచి బీజేపీ నేతలు ఆ పదాన్ని విరివిగా వాడుతున్నారు. కేజ్రీవాల్ ఢిల్లీకి మాత్రమే కాకుండా ఆయన పార్టీకి కూడా విపత్తేనని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు.

6లో

## వ్యూస్‌లోనే కాదు... ఆదాయంలోనూ

# అదుర్స్

- ప్రధాని మోడీ యూట్యూబ్ ఛానెల్‌కు ప్రతి నెలా భారీ ఆదాయం
- ఇప్పటి వరకు 29,272 వీడియోలు అప్‌లోడ్
- 36 కోట్ల 33 లక్షలకు పైగా వ్యూస్
- గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడే యూట్యూబ్ ఛానెల్‌తో ప్రజలకు చేరువ



6లో

సోషల్ మీడియాలో ప్రధాని మోదీ చాలా చురుగ్గా ఉంటారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నేటి యువతరానికి దగ్గర కావడానికున్న మార్గాన్ని ఆయన లాంటి వ్యక్తులు అస్సలు మిస్ చేసుకోరు. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి పీఎం అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత.. మోదీ వాడినట్లు సోషల్ మీడియాను ఎవరూ వాడలేదు అనుకోవచ్చు.

## లొంగిపోయిన 9 మంది నక్సలైట్లు

- ఛత్తీస్‌ఘడ్‌లోని సుక్మా జిల్లాలో ఘటన
- భద్రతా బలగాలపై అనేక దాడులు చేసిన వారే
- 103 మంది జవాన్లను పొట్టన బెట్టుకున్న నక్సల్స్




6లో

## ఎనర్జీ రంగంలో

# భారీ పెట్టుబడులు

- రానున్న పదిలక్షల కోట్ల పెట్టుబడులు
- హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు
- అల్యూమినియం ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడాలి
- గ్రీన్ అమోనియా ఎగుమతి చేస్తాం
- గడ్డి ద్వారా గ్యాస్ తయారీ
- బెంగళూరు స్వాపింగ్ బ్యాటరీల మోడల్ కుప్పంకు
- సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం కొత్త ఆలోచనలు
- సీఎం నారా చంద్రబాబు నాయుడు



వివరాలు-2లో

## నెలాఖరులోగా ఉస్మానియా

# శంకుస్థాపన



3లో

- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లు ఉండాలి
- అధికారులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## నిన్న ఆగ్రహం

# నేడు అభిమానం

- పిఠాపురంలో యువత కోసం డిప్యూటీ సీఎం రూ. 10 లక్షల విలువ చేసే పుస్తకాల కొనుగోలు
- ప్రత్యేక లైబ్రరీ ఏర్పాటుకు ప్రయత్నాలు
- అందులో భాగంగానే పుస్తకాలు అక్కడికి తరలించే ఏర్పాటు
- ఎటువంటి హడావుడి లేకుండా పుస్తకాల కొనుగోళ్లు

యువత నడవడిక, ప్రవర్తనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అవకాశం వచ్చిన ప్రతీ సమయంలోనూ, సమావేశంలోనూ యువతకు స్ఫూర్తిని కలిగించే మంచి మాటలు చెబుతున్నారు. అలాగే మితిమీరి ప్రవర్తిస్తే చురకలు కూడా అంటిస్తున్నారు.



2లో

# పల్లెలకు కదిలిన జనం



3లో

## బస్సులు, ట్రైన్‌లు ఫుల్

- పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్సార్టీసీ ప్రత్యేకంగా 6432 బస్సులు
- ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరంఘర్ బస్‌స్టాండ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు
- తెలంగాణలోని జిల్లాలకు 1600 వందల బస్సులు
- ఏపీ వైపు 300 ప్రత్యేక బస్సులను నడిపేలా ప్రణాళిక

సంక్రాంతి పండుగ సందర్భంగా స్కూళ్లకు వరుసగా సెలవులు రావడంతో హైదరాబాద్ ప్రజలు పల్లెలకు బయలుదేరారు. సొంత వాహనాలు ఉన్న వారు నిన్నటి నుంచే సొంతూళ్లకు పయనమయ్యారు. మరోవైపు బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో కూడా ప్రయాణికుల సందడి నెలకొంది. సొంతూళ్లకు వెళ్లే వారితో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్‌లు కళకళలాడుతున్నాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు పల్లెబాట పట్టడంతో బస్సులు, రైళ్లన్నీ ఫుల్ అయ్యాయి. నిన్నటి నుంచి ప్రయాణికుల రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్సార్టీసీ ప్రత్యేకంగా 6432 బస్సులను నడుపుతోంది.

## అంతా ఇంతే!



ట్రాఫిక్ జాంలు, బస్సుల రద్దీ వల్ల పండక్కి ఇలా సొంతూరు వెళ్తున్నాడట

## ఎమ్మెల్సీ ఎన్నికల తరువాతే

# మంత్రివర్గ విస్తరణ

- త్వరలో కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



3లో

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్ర్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు.

## మహిళా శిశు సంక్షేమంలో ఆదర్శం

- పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు
- ఉదయపూర్ చింతన్ శిబిర్‌లో స్పష్టం మంత్రి సీతక్క



6లో

## దర్యాప్తు సంస్థలు

# బీజేపీ గుప్పిట్లో



2లో

- సీబీఐ, ఈడీ ప్రభుత్వ వ్యవస్థల దుర్వినియోగం
- స్వార్థం కోసం ఇష్టానుసారం వాడుతోంది
- ఫాదర్ ఆఫ్ ది నేషన్ మహాత్మాగాంధీని బీజేపీ విలన్‌గా చిత్రీకరించే యత్నం
- దేశం మొత్తాన్ని కాషాయ మయం చేసే కుట్రలు
- కేంద్ర సర్కార్‌పై షర్మిల ఫైర్

## తెలంగాణ ఉద్యమంలో కళాకారుల

# పాత్ర గొప్పది

- ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుంది : మంత్రి జూపల్లి
- టిజీఎస్ చైర్మన్ : వెన్నెల గద్దర్
- గత ప్రభుత్వ హయంలో డూప్లికేట్ కళాకారులకు సైతం ఉద్యోగాలు
- కవి, గాయకుడు నేర్నాల కిషోర్
- కాంగ్రెస్ ప్రభుత్వం అసలైన కళాకారులను గుర్తించాలి : కవి, గాయకుడు దరువు అంజన్న

తెలంగాణ రాష్ట్రంలో గోస పడుతున్న నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇప్పుడున్న సాంస్కృతిక సారధి పరిధి విస్తృతం చేసి అందరికీ న్యాయం చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.




3లో



## రైతు సంక్షేమ కోసం కూటమి ప్రభుత్వం కృషి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : రైతు సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో రూ. 1.85 లక్షలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన గోకుల షెడ్ ను రాష్ట్ర పౌర సరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గ్రామస్తులు , మహిళలు పండుగ వాతావరణంలోకి తీసుకువచ్చినందుకు మనస్పూర్తిగా జిల్లా యంత్రాంగం తరవున ప్రభుత్వం తరవున , ప్రత్యేకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరవున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమంలో మనందరం భాగస్వామ్యులమేనన్నారు. ప్రస్తుతం మనం ఖర్చుపెట్టే ప్రతి రూపాయి టాక్స్ రూపంలో వస్తుందని, ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా కార్యక్రమాలను తీసుకొని వస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉన్న కొన్ని ఇబ్బందులను లోతుగా అవగాహన తెచ్చుకుని పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పు తీసుకుని రావాలని ముందుకు వచ్చారన్నారు. గత ప్రభుత్వం నిధులు తమ సొంత అవసరాల కోసం వాడుకుని గ్రామీణ వాతావరణాన్ని దెబ్బతీసిందని , గత ఐదు సంవత్సరాలలో ఏ పని చేయలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను పేదరిక నిర్మూలనకు , గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వేసవికాలంలో పనులు కల్పించేందుకు తీసుకురావడం జరిగిందన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో అత్తోట గ్రామంలో మూడు సీసీ రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఈరోజు మినీ గోకులం కింద రూ.1.85 లక్షలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించు కుంటున్నామన్నారు. లబ్ధిదారులు 10 శాతం చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు రూ.1670 కోట్లు బకాయి పెట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు. రైతులకు వారు పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి 24 గంటల్లో డబ్బు చెల్లించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఇంకా ఎవరైనా గోకుల షెడ్లు నిర్మించదలుచుకుంటే దరఖాస్తు చేసుకున్న ఎడల మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

# ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులు

- రానున్న పదిలక్షల కోట్ల పెట్టుబడులు
- హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు
- అల్యూమినియం ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడాలి
- గ్రీన్ అమోనియా ఎగుమతి చేస్తాం
- గడ్డి ద్వారా గ్యాస్ తయారీ
- సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం కొత్త ఆలోచనలు
- సీఎం నారా చంద్రబాబు నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. తాడేపల్లిలో సిఎం నివాసంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కానుందని తెలిపారు. ఈ హైడ్రోజన్తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని పేర్కొన్నారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని వివరించారు. గ్రీన్కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్ను టేకోవర్ చేయనుందని చెప్పారు చంద్రబాబు. ఇక్కడ గ్రీన్ అమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. . ఈ ప్లాంట్ కోసం ఆ సంస్థ రూ. 25 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నదన్నారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్డ్ గ్యాస్ తయారీకి 500 కేంద్రాలు పెడుతోందని, ఒక్కో కేంద్రానికి రూ.130 కోట్లు పెట్టుబడి పెడుతున్నారని వివరించారు. . బయోగ్యాస్ కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఈ గ్యాస్ తయారవుతున్నదని వెల్లడించారు. గడ్డి పెంచడానికి ఎకరాకు రూ.30 వేలు కౌలు రైతులకు రిలయన్స్ చెల్లించనుందన్నారు. బెంగళూరు సంస్థ స్వాపింగ్ బ్యాటరీల మోడల్ ను కుప్పానికి తెచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు. సూర్యఘర్ అమలులో ఉన్న ఇళ్ల యజమానులకు స్వాపింగ్ బ్యాటరీల ఛార్జింగ్ డబ్బు చెల్లిస్తారన్నారు. దీంతో వారికి అదనపు ఆదాయం చేకూరనుందని పేర్కొన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నామని,. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం అని తెలిపారు.

**సంక్రాంతిని కుటుంబ సభ్యులతో జరుపుకోండి**

తెలుగు ప్రజలందరికీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిలో సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు. పండగ సమయంలో ఊరెళ్లి కుటుంబ సభ్యులందరితో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. తాను కూడా అందుకే తాను ప్రతి సంక్రాంతికి ఊరికి వెళున్నట్లు వెల్లడించారు. "పండగ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఊరు వెళ్లి నలుగురితో కలవటం అలవాటు చేసుకోవాలి. అందుకే నేను ప్రతి సంక్రాంతికి మా ఊరికి వెళ్తాను. ఊరు వెళ్లే సంప్రదాయానికి భువనేశ్వరే కారణం. పాతికేళ్ల క్రితం ఆమె పట్టుబట్టి మొదలు పెట్టిన ఈ సంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నాం. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒకచోట అంతా కలవటం, మాట్లాడుకోవడం ఎంతో అవసరం. మనం ఆనందంగా పండగ చేసుకునేటప్పుడు ఊరిలో పేదవారు కూడా ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. వారికి చేయూతనిచ్చి నిలబెట్టాల్సిన బాధ్యత మిగిలినవారిపై ఉంది అని చంద్రబాబు తెలిపారు.

# దర్యాప్తు సంస్థలు బీజేపీ గుప్పిట్లో

విజయవాడ : బీజేపీపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దర్యాప్తు సంస్థలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుంటోందని ఆరోపించారు. అలాగే దేశంలో కాషాయమయం చేసేలే కుట్రలు చేస్తోందని.. చర్చిలు, మసీదులపై దాడులు చేయడం బీజేపీకి అలవాటుగా మారోయిందని మండిపడ్డారు. బీజేపీ దళితులంటే చిన్నచూపన్నారు. రాజ్యాంగ నిర్మత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ను కమలంపార్టీ అవమాన పాలు చేసిందని విమర్శించారు. శనివారం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మతం, కులం పేరుతో బీజేపీ దేశంలో రాజకీయాలు చేస్తుందని వ్యాఖ్యలు చేశారు. సీబీఐ, ఈడీ వంటి అన్ని ప్రభుత్వ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారని.. ఆ వ్యవస్థ లను వారి స్వార్థం కోసం దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశం మొత్తాన్ని కాషాయ మయం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. ఫాదర్ ఆఫ్ ది నేషన్ మహాత్మాగాంధీని బీజేపీ విలన్గా చిత్రీకరించిందని తెలిపారు. ఆయన్ను చంపిన వారిని హీరోగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహింసా మార్గానికి భిన్నంగా హింసా మార్గం వైపు బీజేపీ పాలన సాగుతుందన్నారు. చర్చిలు, మసీదులపై దాడులు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని అన్నారు. అంబేద్కర్ను కూడా వదలకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. సమాజంలో జస్టిస్, సమానత్వం ఉందంటే అంబేద్కర్ రాజ్యాంగం కారణమని చెప్పుకొచ్చారు. ఆయన్ను కూడా పార్లమెంటులో ఎంత హేళన చేశారో చూశామన్నారు. దళితులు అంటేనే చిన్న చూపు బీజేపీకి అని విమర్శించారు. కుల గణన విషయంలో కూడా బీజేపీ ప్రజలను మోసం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయాలనే కాంగ్రెస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఏపీలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అనేది తేలిపోయిందన్నారు. బీజేపీ రాష్ట్రానికి ఎంత అన్యాయం చేసినా వీరి ముగ్గురు మాట్లాడరన్నారు. అంబేద్కర్ను అవమానించిన బీజేపీ క్షమాపణ చెప్పాల్సిందే అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

**తిరుపతి తొక్కిసలాట ఘటనపై :** తిరుపతిలో తొక్కిసలాటకు ప్రభుత్వం వైఫల్యం కారణమని వైఎస్ షర్మిల ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించి విచారణ కోరిందన్నారు. ఉన్నతస్థాయి విచారణ చేసి బాధ్యులు అయిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. లడ్డూ వివాదం తరహాలో ఈ ఘటనపై కూడా చంద్రబాబు సీరియస్గా తీసుకోవాలన్నారు. భద్రతాపరమైన లోపాల వల్లే ఈ తొక్కిసలాట జరిగిందనేది వాస్తవమన్నారు. అంతమంది వచ్చిన సమయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సిందని.. ఈ ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ తరవున సంతాపం తెలియ చేస్తున్నామని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

# నిన్న ఆగ్రహం - నేడు అభిమానం

- పిఠాపురంలో యువత కోసం డిప్యూటీ సీఎం రూ. 10 లక్షల విలువ చేసే పుస్తకాల కొనుగోలు
- ప్రత్యేక లైబ్రరీ ఏర్పాటుకు ప్రయత్నాలు
- అందులో భాగంగానే పుస్తకాలు అక్కడికి తరలించే ఏర్పాటు
- ఎటువంటి హడావుడి లేకుండా పుస్తకాల కొనుగోళ్లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : యువత నడవడిక, ప్రవర్తనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అవకాశం వచ్చిన



ప్రతీ సమయంలోనూ, సమావేశంలోనూ యువతకు స్ఫూర్తిని కలిగించే మంచి మాటలు చెబుతున్నారు. అలాగే మితిమీరి ప్రవర్తిస్తే చురకలు కూడా అంటిస్తున్నారు. తిరుపతి తొక్కిసలాట సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో యువకులు, పవన్ ఫ్యాన్స్ సినిమాలకు సంబంధించిన నినాదాలు చేశారు. ఆ సమయంలో యువతపై తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏ సమయంలో ఏ విధంగా వ్యవహరించాలి? ఎటువంట నినాదాలు చేయాలో తెలుసుకోవాలని యువకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని అక్కడ స్పష్టం చేయడంతోపాటు ఫితాపురంలో శుక్రవారం నాటి పర్యటనలో తన నియోజకవర్గ యువకులకు పలు సూచనలు చేశారు. మంచి నడబడిక, ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆ యువకులకు ఉపయోగపడే విధంగా శనివారం మరో నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో జరుగుతున్న బుక్ ఫెస్టివల్ ను శనివారం మరోసారి సందర్శించారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే పుస్తకాలను కొనుగోలు చేశారు. తన కోసం ప్రత్యేకంగా శనివారం ఉదయం పూట రెండు గంటలు స్టాల్స్ ఓపెన్ చేయాలని పవన్ విజ్ఞప్తి చేయడంతో నిర్వాహకులు అంగీకరించారు. పవన్ కోసం రెండు గంటల పాటు ప్రత్యేకంగా స్టాల్స్ ఓపెన్ చేసి పెట్టారు. దీంతో పవన్ మీడియాతో పాటు ఎలాంటి హడావిడి లేకుండా వ్యక్తిగతంగా వెళ్లి బుక్స్ ను తీరిగ్గా పరిశీలించి ఇంత భారీ ఆర్డర్ చేశారు. తన సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో యువత కోసం ఓ మంచి లైబ్రరీ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో భావిస్తున్నారు. దీని కోసమే ఇంత భారీ ఎత్తున సొంత డబ్బులు వెచ్చించి మరీ పుస్తకాలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆ పుస్తకాలను ఆయన కారులోనే తీసుకెళ్లినట్లు సమాచారం. పవన్ బుక్ ఫెస్టివల్ సందర్శనను జనసేన పార్టీ కూడా గోప్యంగా ఉంచింది. అయితే పార్టీ తరవున ఫొటోలు మాత్రం విడుదల చేశారు. సహజంగానే పుస్తకాల పురుగు అయిన పవన్ కళ్యాణ్ ఇప్పటికే 2 లక్షల పుస్తకాలు చదివినట్లు పలుమార్లు చెప్పుంటారు. అలాగే పలు బుక్ ఫెస్టివల్స్ కు వెళ్లడం ఆయనకు అలవాటే. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదువుతానని కూడా పవన్ గతంలో చాలాసార్లు చెప్పారు. అలాగే తన ప్రసంగాల్లోనూ తాను చదివిన పుస్తకాల్లో కోట్స్ కూడా వాడుతుంటారు.

# హొటల్‌ను దౌర్జన్యంగా లాక్కున్న గోపిరెడ్డి అనుచరులు

- వారసత్వంగా వచ్చిన భూమి కబ్జా చేశారంటూ మహిళ ఆవేదన
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు మొరపెట్టుకున్న బాధితులు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు అందుకున్న సీఎం
- అన్నక్యాంటీన్‌కు విరాళం ఇచ్చిన దాతలు


అమరావతి : 2014లో స్పీకర్గా ఉన్న సమయంలో కోడెల శివప్రసాద్ రావు నరసరావుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డులో షాపు ఏర్పాటుకై కొంత స్థలం ఇచ్చారు. అందులో చిన్నపాటి టిఫిన్ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక హోటల్పై కన్నేసిన అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మనుషులు దౌర్జన్యంగా లాక్కున్నారు. భర్తను కోల్పోయి ఏ ఆధారం లేని నా లాంటి అభాగ్యురాలు నుంచి దౌర్జన్యంగా హోటల్ లాక్కున్న వైసీపీ నేతలు సుబ్బారెడ్డి, లక్ష్మణ్రెడ్డిపై చర్యలు తీసుకుని నా హోటల్ నాకు అప్పగించేలా చేయండి అని వీరవల్లి వెంకాయమ్మ అనే మహిళ సీఎం చంద్రబాబుకు విన్నవించారు. హోటల్ దగ్గరకు వెళ్లిన ప్రతిసారీ దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందించారు. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర బాధిత వర్గాల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా, దుర్గి మండలం, మంగావరంలో తనకు వారసత్వంగా వచ్చిన ఐదెకరాల పొలంలోకి గ్రామంలోని కొందరు వ్యక్తులు దిగనీయకుండా దాడికి పాల్పడుతున్నారని, గతంలో తన తల్లిని కూడా చంపారని మాచర్లకు చెందిన యరిపల్లి ముత్యాలమ్మ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 2009లో కూడా ఒకసారి తనను చంపేందుకు కుట్ర పన్నారన్నారు. పొలం సమస్యపై దుర్గి ఎమ్మార్వోను ఆశ్రయించినా ఎటువంటి చలనం లేదని వాపోయారు. బాధితుల సమస్యలు విన్న సీఎం పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**అన్నక్యాంటీన్‌కు విరాళాలు**



అన్నక్యాంటీన్‌కు మొక్కపాటి శేషగిరిరావు, రాధాకృష్ణ అనే ఇద్దరు దాతలు రూ.1 లక్ష చొప్పున విరాళం ఇచ్చారు. చెక్కులను సీఎం చంద్రబాబుకు అందించారు. పేదల కడుపు నింపే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వానికి మద్దతుగా ముందుకొచ్చినందుకు శేషగిరిరావు, రాధాకృష్ణను సీఎం చంద్రబాబు అభినందించారు.

# ఐటీ రంగం తర్వాత గ్రీన్ ఎనర్జీపై సీఎం ఫోకస్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ఐటీ తరువాత గ్రీన్ ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. ఐటీ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు ఆయా ప్రాంతాలు ఆర్థికంగా పటిష్టంగా తయారవుతాయని, ఉమ్మడి ఏపీగా ఉన్న సమయంలో హైదరాబాద్ ను చంద్రబాబు అలానే డెవలప్ చేశారని చెప్పారు. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీపై ముఖ్య మంత్రి దృష్టి సారించారని తెలిపారు. ఓర్వకల్లు మండలం పిన్నావురంలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశంలోనే అద్భుతమైన ప్రాజెక్టు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం ప్రాజెక్టును సందర్శించిన పవన్కళ్యాణ్.. ఈ ప్రాజెక్ట్ దేశానికే మార్గదర్శకమన్నారు. ఒకే ప్రాంతంలో పవన విద్యుత్తు, సౌర విద్యుత్తు, హైడ్రాలిక్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సోలార్, పవ్న, జల విద్యుత్ ద్వారా పొల్యూషన్ లేని విద్యుత్ ఇక్కడ తయారవుతుందని అన్నారు. అనిల్ చలంశెట్టి, మహేష్ గ్రీన్ కో ప్రారంభించా రన్నారు. వీరు సోలార్ ఇతర విద్యుత్ ఉత్పత్తి రంగంలో దేశంలో లక్షన్నర కోట్లు పెటుబడి పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీలో రూ.30 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు.. మరో రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారని పవన్ కళ్యాణ్ తెలిపారు. పిన్నవురంలో రూ.10 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు, ఇంకా 14 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇక్కడ ఉత్పత్తి అయిన కార్బన్ రహిత శక్తి గ్రీన్ స్టీల్, గ్రీన్ అల్యూమినియం, గ్రీ హైడ్రోజన్ ఉత్పత్తి వంటి పరిశ్రమలకు సరఫరా చేయబడుతుందన్నారు. గ్రీన్ కో ప్రాజెక్ట్ యాజమాన్యం అటవీ నిబంధనలను ఉల్లంఘించి 45 హెక్టార్లను ఆక్రమించిందంటే చూసేందుకు వచ్చానని పవన్ కళ్యాణ్ అన్నారు. వాస్తవానికి గ్రీన్కో ప్రాజెక్టు నిర్మాణం కోసం 2800 ఎకరాల్లో 1700 ఎకరాలు కొనుగోలు చేశారు. వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఇలాంటి అద్భుతమైన ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఉపముఖ్య మంత్రి చెప్పారు. చంద్రబాబు ఐటీ తరువాత గ్రీన్ ఎనర్జీ పై దృష్టి పెట్టారు అందులో భాగంగా పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. దేశానికి ప్రతిష్టాత్మకమైనది రెన్యూవల్ ఎనర్జీ ప్రాజెక్టు అని అభిప్రాయపడ్డారు. దేశానికి రెండున్నర లక్షల పెట్టుబడులు తీసుకురాగలిగారు.. 365 ఎకరాలు కేంద్రం నుంచి అటవీ భూమి కొన్నారు. అందుకు కంపెనీ 365 ఎకరాల భూమి నెల్లూరు జిల్లాలో ఇచ్చారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 45 హెక్టార్ల భూమి రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకే తాను వచ్చానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రాజెక్టు విషయంలో ఎలాంటి వివాదం వచ్చినా కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది భారీ ప్రాజెక్టు.. ఇందులో చిన్న చిన్న ఇబ్బందులు ఏర్పడడం సహజం కానీ వారికి పరిష్కరించుకుని పోతే.. మేలు జరుగుతుందన్నారు. పర్యాటక ప్రాంతంగా, ఎడ్యుకేషన్ టూర్ ప్లేస్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఈ ప్రాంత యువతీ, యువకులకు ఉపాధి కల్పించేలా పనులు చేపట్టాలని సూచించారు. కడప, చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఆక్రమణకు గురవుతున్నాయని.. అటవీశాఖ భూముల ఆక్రమణలపై రెవెన్యూ, అటవీ భూముల వివా దాలపై సమీక్ష చేస్తానని చెప్పారు. కాగా, 2021లో కర్నూ లులో గ్రీన్ కో ప్రాజెక్టు ప్రారంభం అయ్యిందని, ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. భవిష్య త్తులో ఇదో గొప్ప పర్యాటక ప్రాంతం అవుతుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు

# విద్యాసంస్థల బస్‌లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సంక్రాంతి శోభతో తెలుగు వారి లోగిళ్లలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఎక్కడెక్కడో ఉన్న తెలుగు వారు సంక్రాంతి వేడుకల కోసం స్వస్థలాలకు వస్తున్నారు. ముఖ్యంగా, పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఏపీకి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన సూచన పట్ల ఆయన వెంటనే స్పందించి పైవిధంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు కళాశాలలకు చెందిన బస్సులను కూడా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రయాణికులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సుల సాయంతో ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపించే ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అయితే, ఫిట్ నెస్ ఉన్న బస్సుల్లోనే ప్రయాణికులను పంపించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నడిపి ప్రజలకు ప్రయాణ కష్టాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

### మొదలుకానున్న

# రేషన్ కార్డుల జాతర



అమరావతి : ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు. ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కొత్త కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడువుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతులకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి.

### ఏపీకి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చేందుకు

# కృషి చేస్తున్నాం



కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ. 14 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదిరిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కు చెందిన యిటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రిస్ గ్రూప్, బి.ఎన్ గ్రూప్ లు కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో హైదరాబాదులో మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎం.ఓ.యూ కుదుర్చుకున్నట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు. అమరావతిలో గత నెలలో మంత్రి నారా లోకేష్తో కంపెనీ ప్రతినిధులు సమావేశమై పెట్టుబడులు పెట్టే విషయంపై చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. రూ. 14వేల కోట్ల ఈ భారీ సెమీ కండక్టర్ పరిశ్రమ ఇండియాలో మొదటిసారిగా మన రాష్ట్రంలో ఏర్పాటుకానుందన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్తో, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును తీసుకొచ్చామని మంత్రి భరత్ అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పెట్టబోయే ఈ భారీ సెమీ కండక్టర్ ప్రాజెక్టును రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసే దిశలో ముందుకు వెళుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టు రావడంతో పాటు మరిన్ని పరిశ్రమలు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కు రానున్నాయన్నారు. ఈ సెమీ కండక్టర్ పరిశ్రమ వల్ల వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని తెలిపారు.



పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న గారి జయంతి సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, టీడీపీ నేతలు, కార్యకర్తలు

# నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

- భవిష్యత్ అవసరాలకనుగుణంగా డిజైన్లు ఉండాలి
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: ఈనెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు సీఎం. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర గొప్పది

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

- కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుంది
- టి యస్ యస్ చైర్మన్ : వెన్నెల గద్దర్
- గత ప్రభుత్వ హయంలో డూప్లికేట్ కళాకారులకు సైతం ఉద్యోగాలు: కవి, గాయకుడు నేర్నాల కిషోర్
- కాంగ్రెస్ ప్రభుత్వం అసలు సిసలైన కళాకారులను గుర్తించాలి : కవి, గాయకుడు దరువు అంజన్న

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో గోస పడుతున్న నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇప్పుడున్న సాంస్కృతిక సారధి పరిధి విస్తరణ చేసి అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు, రవీంద్ర భారతి వేదికగా విద్వంస జీవన విధానం – సాంస్కృతిక చైతన్యం అనే సదస్సును పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆడి పాడి గోసపడ్డ నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు, త్వరలో ఒక కమిటీని వేసి ఆ కమిటీ ద్వారా సూచనలు తీసుకొని ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని ఆయన అన్నారు, కళాకారుల ఉపాధి కోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచ చరిత్రలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఎంతో ఖ్యాతి ఉందని, తెలంగాణ ఉద్యమం గొప్ప త్యాగధనుల ఉద్యమం అని ఆ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కవులు కళాకారులను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదని కావున త్వరలో కళాకారుల గురించి ప్రభుత్వంతో చర్చించి సానుకూల స్పందన వచ్చేలా చేస్తానని తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు, ఓయూ జేఏసీ నేత కవి గాయకులు దరువు అంజన్న మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారుల ఉద్యోగాలు



కావాలని కోరితం ప్రజాస్వామిక హక్కుని, నిరుద్యోగ కళాకారుల సంఘం తరఫున 720 మంది లిస్టును ప్రభుత్వానికి పంపించడం జరిగిందని వారికి ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. కవి, రచయిత, ఉద్యమ నేత నేర్నాల కిషోర్ మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా నిరుద్యోగులకు అన్యాయం చేసిందని ఇగో అగో అని ఆశ చూపిస్తూ వారి జీవితాలతో ఆడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు, టిపిసిసి సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి పాటనై ఆటనై



జీవిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీకి తప్ప ఏ పార్టీకి పాట పాడలేదని, కళాకారుల జీవనస్థితిగతుల గురించి మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేతలు అనుమోజు వెంకటేష్ నకరికంటి కిరణ్, వివిధ ప్రజా సంఘాల నేతలు కవులు రచయితలు, గజవెల్లి ప్రతాప్, పందిరి సైదులు, నకరికంటి చిరంజీవి, కొండ్ర కుమార్, పేరాల యాదగిరి, గ్యార యాకయ్య, సందమల్ల నరేష్, మట్టెడ కవిత, వరంగల్ రవి, పుష్ప, నర్మదా, శారద, శ్రీనివాస్ యాదవ్, పెన్నింటి దాసు, బాలు, సలీం,పుష్పలత, హైమద్, చిట్టిబాబు, సంపత్, పాట మహేష్,రాజశ్రీ, మెదక్ సత్తన్న,గోనెల సమ్మయ్య,ఎర్రవల్లి శ్రీనివాస్, ప్రసాద్, ఖమ్మం ఫక్రుద్దీన్, వెంకటేశ్వరరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి సీఎం రేవంత్ నివాళి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రికి సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. శనివారం లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీకి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన దివంగత భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పని చేసిన లాల్ బహదూర్ శాస్త్రి కి భారత ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి కి నివాళి అర్పించినవారిలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇతర నేతలు ఉన్నారు.

### లోక్‌దళ్ నివాళి

స్వర్గీయ మాజీ ప్రధాని, భారత రత్న లాల్ బహద్దూర్ శాస్త్రి వర్దంతి సందర్భంగా భారత జాతీయ లోక్ దళ్( ఓం ప్రకాష్ చౌతాలా) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు ఘన నివాళి అర్పించారు. శనివారం హిమా యత్ నగర్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లాల్ బహద్దూర్ శాస్త్రి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాల్ బహద్దూర్ శాస్త్రి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. యువత ఆయన మార్గంలో పయ నించాలని, రాజకీయాలకు మరింత చేరువ కావాలని సూచించారు.

## అల్లు అర్జున్‌కు ఊరట

- ప్రతి ఆదివారం హాజరు కావాలన్న నిబంధనను కోర్టు మినహాయింపు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ప్రతి ఆదివారం హాజరు కావాలన్న నిబంధనను కోర్టు మినహాయించింది. ప్రతి ఆదివారం చిక్కడ పల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని గతంలో కోర్టు షరతు విధించింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా మినహాయింపు ఇవ్వాలని అల్లు అర్జున్ కోరారు. దీనికి నాంపల్లి కోర్టు అంగీకారం తెలిపింది. మరోవైపు అల్లు అర్జున్ విదేశాలకు వెళ్లేందుకు కూడా న్యాయస్థానం అనుమతించింది. కాగా.. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో సినీ నటుడు అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనలో ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న నేపథ్యంలో విచారణకు సహకరించాలని చెబుతూ ప్రతీ ఆదివారం కూడా విచారణకు హాజరుకావాలని కోర్టు షరతు విధించింది. ప్రతీ ఆదివారం కూడా అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్ స్టేసన్‌కు వెళితే భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని.. ఆదివారం రోజున వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యే అంశాన్ని ఎత్తివేయాలని నాంపల్లి కోర్టులో మరొక పిటిషన్‌ను బన్నీ దాఖలు చేశారు. దానిపై విచారించిన నాంపల్లి కోర్టు.. ప్రతీ ఆదివారం విచారణకు మినహాయింపు ఇచ్చింది. కానీ అల్లు అర్జున్‌ను విచారణ చేయాలని భావిస్తే నోటీసు ఇచ్చి పోలీసులు విచారణ జరపవచ్చని తేల్చిచెప్పింది. భద్రతా కారణాల వల్ల మాత్రమే మినహాయింపు ఇస్తున్నట్లు నాంపల్లి కోర్టు స్పష్టం చేస్తోంది. ఈ కేసు విచారణ దశలో ఉన్న తరుణంలో విదేశాలకు వెళ్లేందుకు వీలులేదని కోర్టు తొలత చెప్పింది. ఈ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకున్న కోర్టు.. అల్లు అర్జున్‌ను విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఇప్పటి వరకు అల్లు అర్జున్‌ను నాలుగు సార్లు పోలీసులు విచారించారు. స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ కేసులో మొత్తం 18 మందిని నిందితులుగా చేర్చారు. ఇంకా ఈ కేసు చార్జ్‌షీట్ అయ్యేంత వరకు విచారణ కొనసాగనుంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్లు పూర్తి అయ్యారు. ఈ కేసులో ఇంకా విచారణ జరపాలని పోలీసులు భావిస్తే అల్లు అర్జున్ విచారణకు సహకరించాలని బెయిల్ షరతుల్లో కచ్చితంగా పేర్కొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ వసతి కల్పిస్తాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: నిరుద్యోగులకు ఉద్యోగ వసతి కల్పిస్తా మని, నిరుద్యోగ రహిత మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం చేసేందుకు ప్రయత్నిస్తు న్నామని బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. తొమ్మిది అసెంబ్లీ( ఎల్బీ నగర్, ఉప్పల్, మల్కాజగిరి, మేడ్చల్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి, హుజూరాబాద్, గజ్వేల్) నియోజకవర్గాల్లో నిరుద్యోగ సర్వే మొదలు పెట్టినట్లు తెలిపారు. నెలకు వెయ్యి ఉద్యోగాల కల్పన లక్ష్యం అని నిరుద్యోగ రహిత నియోజకవర్గాలుగా తీర్చిదిద్దడం నా లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం నిపుణ ఎన్జీఓ సమన్వయంతో ఎంప్లాయిమెంట్ సెల్ ను ప్రారంభించారు. నిరుద్యోగరహిత మల్కాజ్గిరిలి పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా షామీర్ పేట నివాసంలో ఆయన మాట్లాడుతూ నా 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రతి నిత్యం ఏరుకుంటున్న సమస్య నిరుదోగ్య సమస్య. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ చదువుకుంటున్నారు. కానీ అందరికీ ఉద్యోగ అవకాశాలు రావడం లేదు. అందుకే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సమస్య పరిష్కారానికి నాలుగు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో పెట్టారు.

ఈ యువతకు పని కలిపించాలి దేశ నిర్మాణంలో భాగస్వామ్యులను చేయాలని సంకల్పించారు. నేనుగా మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో ఈరోజు నుండి ఇంటింటికి సర్వే నిర్వహిస్తారు. ఎవరెవరు నిరుద్యోగులున్నారు వారికి ఎలాంటి ఉద్యోగాలు కావాలి నివేదిక రూపొందిస్తారు. ప్రతి నెల వెయ్యికి తగ్గకుండా ఉద్యోగాలు కలిపించడమే ఈ సంస్థ లక్ష్యం. నియోజకవర్గంలో అనేక కంపెనీలు ఉన్నాయి వాటిల్లో ఉద్యోగాలు కల్పించడమే మా ఎజెండా అని నిరుద్యోగ రహిత పార్లమెంట్ నియోజకవర్గంగా తయారుచేయడమే నా లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు.

## దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది

- యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని ఖండించిన కేటీఆర్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని ఆక్షేపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న భారాస కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ.. అరాచకాలకు చిరునామాగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలతో పాటు వారి వెనకున్న నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ఇదేనా ఇందిరమ్మ రాజ్యం: హరీశ్‌రావు...**

ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. "ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాడులు చేసే సంస్కృతిని ఎక్కువైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడి చేస్తే, ఆ పార్టీ నాయకులు భౌతికదాడులకు పాల్పడుతున్నారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం ఇదేనా మీ ప్రజాపాలన" అని హరీశ్ రావు ప్రశ్నించారు.

## కేసీఆర్ ప్రభుత్వ దోపిడీపై చర్యలు

- మంత్రి ఉత్తమ్ షాకింగ్ కామెంట్స్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: త్వరలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడ్డారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ వ్యవస్థ రాబోతోందన్నారు. వీఆర్వో లు వీఆర్ఏలు రాష్ట్రంలో సుమారు 23 వేలమంది ఉన్నారని చెప్పారు. వాళ్లలో 16300 మంది రెవెన్యూశాఖలోకి రావటానికి దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ప్రెస్ అకాడమీతో చర్చించి త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్‌లు ఇస్తామని ప్రకటించారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు. త్వరలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేద కుటుంబాన్ని ఒక యూనిట్‌గా ఎంపిక చేస్తున్నామని అన్నారు. ఆ కుటుంబం తప్పని సరిగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉండాలని.. అంతకుమించి నిబంధనలు ఏమీ ఉండవని చెప్పారు.

## కేసీఆర్ మళ్ళీ సీఎం కాబోతున్నారు..!

- నాడు కేసీఆర్ ప్రతి రైతుకు రైతు బంధు అందించారు
- రేవంత్ రైతులకు ఒకసారైనా రైతుబంధు వేశారా ?
- రైతు భరోసా ఎకరానికి 15 వేలు ఇచ్చేంత వరకు వదిలేది లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః హుజురాబాద్ నియోజకవర్గ రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని అందించడంలో ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తోందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హుజురాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో కాకతీయ కాలువ ద్వారా నీరు కొనసాగుతున్నప్పటికీ, డీబీఎం 16 ద్వారా హుజురాబాద్ రైతులకు నీరును అందించకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని, ఇది అసహనానికి గురిచేస్తోందన్నారు. ఖమ్మం కోసం నీటిని తరలిస్తూ తమ నియోజకవర్గాన్ని విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. అవసరమైతే కాలువ షెటర్లను పగులగొట్టి రైతులకు నీటిని అందిస్తానని ఆయన హెచ్చరించారు. తాను పోలీసులకు వ్యతిరేకం కాదని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అందించేవరకు పోరాటం కొనసాగిస్తానని, హుజురాబాద్ ప్రజల కోసం ఎన్ని కేసులు పెట్టినా వెనక్కు తగ్గేదిలేదని స్పష్టం చేశారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లలకు రూ.1,16,000 అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలోని సుఖ ప్రసవాల ప్రోత్సాహ పథకాన్ని ఉదహరిస్తూ, ఆడపిల్ల పుట్టినప్పుడు రూ.13,000, మగపిల్ల పుట్టినప్పుడు రూ.12,000 అందించి, తల్లి బిడ్డలను అంబులెన్స్ ద్వారా ఇంటి వరకు తీసుకెళ్లారని గుర్తు చేశారు.

కేసీఆర్ మళ్ళీ సీఎం కాబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక, తహసీల్దార్ కనకయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల తరువాతే మంత్రివర్గ విస్తరణ

- త్వరలో కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు పీసీసీ చీఫ్. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ మాట్లాడుతూ.. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. వచ్చే 20 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని హైకమాండ్ గట్టి వార్నింగ్ ఇచ్చిందని తెలిపారు. ఈ నెల చివరి నాటికి పార్టీలో అన్ని కమిటీలను నియమిస్తామని తెలిపారు. కార్పోరేషన్ పదవుల భర్తీ నెలలోపు అయిపోతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ జిల్లాల బాట

- కొత్త పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి
- సంక్రాంతి తర్వాత పథకాల పై స్పీడ్ పెంచేలా ప్లాన్
- రైతు భరోసా, భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పై సీఎం రేవంత్ ఫోకస్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు రవాణా, గృహజ్యోతి, రైతు రుణమాఫీ పథకాలను అమలు చేసిన రేవంత్ సర్కార్.. కొత్త పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ పథకాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పథకాలకు సంబంధించి సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టబోతున్నారు తెలంగాణ సీఎం. అందుకు కోసం జనవరి 26 తర్వాత జిల్లాల బాట పట్టనున్నారు. జిల్లాలో తిరుగుతూ.. ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కొత్త పథకాల అమలుపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. సంక్రాంతి తర్వాత పథకాల పై స్పీడ్ పెంచేలా ప్లాన్ సిద్ధం చేశారు.

రైతు భరోసా, భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లపై సీఎం రేవంత్ ఫోకస్ పెట్టారు. పథకాలు పారదర్శకంగా అమలయ్యేలా కలెక్టర్లకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. కీలక పథకాలకు నిధుల కొరత లేకుండా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే రైతు భరోసా కోసం రూ.8 వేల 6 వందల కోట్లను సిద్ధం చేసింది సర్కార్. జనవరి 26 నుంచి రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు జమ కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. జనవరి 26 నుంచి భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయం అందజేయనున్నారు. దీని ద్వారా దాదాపు 12 లక్షల మంది భూమిలేని వ్యవసాయ కూలీలకు లబ్ది చేకూరనుంది. వీటితో పాటు జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీకి నిర్ణయం తీసుకుంది రేవంత్ సర్కార్. గత పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం రాష్ట్రంలో అనేక మంది పేదలు ఎదురు చూపులు చూస్తున్న పరిస్థితి. వారి కోరిక నెరవేరేలా జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్‌కు సీఎం సూచనలు చేశారు. "జనవరి 26 తర్వాత జిల్లాల పర్యటనకు వస్తా.. ఆకస్మిక తనిఖీలు చేస్తాను" అంటూ అధికారులు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.

### కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి..

## ఐదుగురు యువకులు మృతి




తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః: సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్‌కు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులు హైదరాబాద్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. మృతి చెందిన ధనుష్, లోహిత్ ఇద్దరూ సొంత అన్నదమ్ములు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# పల్లెలకు కదిలిన జనం

## బస్సులు, ట్రైన్‌లు ఫుల్

- పండుగ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా 6432 బస్సులు
- ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరంఘర్ బస్‌స్టాండ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు
- తెలంగాణ జిల్లాలకు 1600 వందల బస్సులు
- ఏపీ వైపు 300 ప్రత్యేక బస్సులను నడిపేలా ప్రణాళిక



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: సంక్రాంతి పండుగ సందర్భంగా స్కూళ్లకు వరుసగా సెలవులు రావడంతో హైదరాబాద్ ప్రజలు పల్లెలకు బయలుదేరారు. సొంత వాహనాలు ఉన్న వారు నిన్నటి నుంచే సొంతూళ్లకు పయనమయ్యారు. మరోవైపు బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో కూడా ప్రయాణికుల సందడి నెలకొంది. సొంతూళ్లకు వెళ్లే వారితో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్‌లు కళకళలాడుతున్నాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు పల్లెబాట పట్టడంతో బస్సులు, రైళ్లన్నీ ఫుల్ అయ్యాయి. నిన్నటి నుంచి ప్రయాణికుల రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్సార్టీసీ ప్రత్యేకంగా 6432 బస్సులను నడుపుతోంది. ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరంఘర్ బస్‌స్టాండ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని జిల్లాలకు 1600 వందల బస్సులు, ఏపీ వైపు 300 ప్రత్యేక బస్సులను నడిపేలా ప్రణాళిక చేశారు.

అయితే ఈ స్పెషల్ బస్సుల్లో అదనంగా 50 శాతం చార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. పండగ రద్దీని ఆసరగా చేసుకుని ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులను మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఎక్కువ చార్జీలు వసూలు చేసే బస్సులను సీజ్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయ్యాయి. పండుగ ముందు, తర్వాత కూడా వంద శాతం బుగింక్ పూర్తి అయ్యింది. ఈనెల 20 వరకు బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. చేసేదేమీ లేక డబ్బులు ఎక్కువైనా చాలా మంది ప్రైవేటు వాహనాలను



ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా ప్రైవేటు బస్సు ఆపరేటర్లు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇక సంక్రాంతి సందర్భంగా 366 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్ నుంచి ఏపీలోని నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు 59 ప్రత్యేక రైళ్లను వేశామని అధికారులు చెప్పారు. 11, 12 తేదీల్లో చర్లపల్లి – విశాఖపట్నం – చర్లపల్లి వరకు సాధారణ కోచ్‌లతో 16 రైళ్లను నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ఇక అన్‌రిజర్వ్‌కోచ్‌డ్‌లో వెళ్లే ప్రయాణికులు కౌంటర్ల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా మొబైల్ యాప్‌లో యూటీఎస్ ద్వారా టికెట్‌లు పొందడానికి అవకాశం ఉందని తెలిపారు. అలాగే పండగ నేపథ్యంలో విమాన ఛార్జీలు మూడు రెట్లు పెరిగాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు శని, ఆదివారాల్లో గరిష్టంగా రూ.17వేల నుంచి రూ.18 వేల మధ్య టికెట్ ధరలు ఉన్నాయి.

## సంక్రాంతి పండుగ వేళ.. రైల్వేశాఖ గుడ్‌న్యూస్

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రయాణికుల కోసం రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే అదనపు రైళ్లను నడపడానికి దక్షిణ మధ్య రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 26 అదనపు రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనవరి 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఈ అదనపు రైళ్లు అందుబాటులో ఉంటాయని ప్రకటించారు. చర్లపల్లి నుంచి విశాఖపట్నానికి, సికింద్రాబాద్ బెంగళూరు మధ్య అదనపు రైళ్లను నడపుతున్నట్లు వివరించారు. ఏపీకి వెళ్లే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి విశాఖపట్నం మధ్య జనసాధారణ్ అన్‌రిజర్వుడ్ రైళ్లను నడుపుతున్నట్లు చెప్పారు. చర్లపల్లి నుంచి విశాఖకు ఈ నెల 11, 13, 16, 18, 20, 25 తేదీల్లో రైళ్లు అందుబాటులో ఉంటామని అన్నారు. చర్లపల్లిలో ఉదయం10 గంటలకు బయలుదేరి విశాఖపట్నానికి రాత్రి 10 గంటలకు ఈ ట్రైన్లు చేరుకుంటాయన్నారు. అలాగే విశాఖ నుంచి చర్లపల్లికి ఈ నెల 10, 12, 15, 17, 20, 25 తేదీల్లో రైళ్లు నడుస్తాయని చెప్పారు. విశాఖ నుంచి సాయంత్రం 6.20గంటలకు బయలుదేరి ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకుంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

సూర్య
విజయవాడ
ఆదివారం
12 జనవరి 2025



# సంపాదకీయం

suryaeditpage@gmail.com

నూతన సంవత్సర వేడుకలతో పాటు క్రిస్మస్ పర్వదినాలను ఘనంగా జరుపుకొని సేదదీరుతున్న వేళ జనవరి 07, 2025 రోజున ప్రారంభమైన 'అణుబాంబు విస్ఫోటనం' లాంటి కార్చిచ్చు లేదా వైల్డ్ఫైర్ ఇప్పటికే ఐదు ప్రాంతాలను ఆక్రమించడం,1.8 లక్షలకు పైగా ప్రజలను సురక్షిత స్థానాలకు లేదా శిబిరాలకు తరలించడం, మరో 2 లక్షల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించ డానికి హెచ్చరికలు జారీ చేయడం, ఇప్పటికే కనీసం ఆరుగురు అగ్నికి ఆహుతి కావడం, లెక్కకు మించి గాయాలపాలు కావడం, వేల ఇండ్లు కాలి బూడిద కావడం, అనేక లక్షల ఇండ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, అత్యంత సంపన్నుల అద్దాల మేడలు సహితం మంటల్లో కుప్పకూలడం, వేగంగా విస్తరిస్తున్న కార్చిచ్చు నేటికీ అదుపులోకి రాకపోవడంతో అమెరికాతో పాటు ప్రపంచ మానవాళి తమ సంతాపాలను, సహానుభూతులను ప్రకటించడం జరుగుతోంది. తొలుత 'పాలిసేడ్స్' ప్రాంతంలో మొదలైన చిన్న కార్చిచ్చు నేడు దాదాపు 18,000 ఎకరాలకు విస్తరించడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా నమోదు అవుతున్నాయి. 'ఈటన్' ప్రాంత కార్చిచ్చులు 13,000 ఎకరాలకు, 'హర్స్ట్' ప్రాంత కార్చిచ్చులు 700 ఎకరాలకు, 'లిడియా' ప్రాంత కార్చిచ్చులు దాదాపు 500 ఎకరాలకు, 'కెన్నెత్' ప్రాంత కార్చిచ్చులు 800 ఎకరాలకు, 'సన్సెట్' ప్రాంత కార్చిచ్చులు 60 ఎకరాలకు విస్తరించి అదుపు చేయలేని నిస్సహాయ స్థితికి అమెరికన్ యంత్రాంగం చేరింది. కాలిఫోర్నియా ప్రాంతంలో కార్చిచ్చులు తరుచుగా ఎగిసిపడడానికి సహజ ప్రకృతి ప్రకోపంతో పాటు

## లాస్ ఏంజెలిస్ కార్చిచ్చు ప్రకృతి ప్రకోపమా, మానవ తప్పిదమా ?

మానవ తప్పిదాలు కూడా కారణం అవుతున్నాయి. ప్రతికూల వాతావరణ మార్పులతో సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, భూ ఉపరితలం పూర్తిగా ఎండలకు ఎండుతూ పొడిబారడం జరుగుతోంది. 2023-24 ఏడాది అత్యంత వేడి కలిగిన వడ గాలులను చవిచూసాయి. అటు తీవ్రమైన వడగాలులు, ఇటు పచ్చదనం ఎండిపోయి పొడిబారడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లు కార్చిచ్చు వేగంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలకు సహితం లొంగడం లేదు. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కార్చిచ్చులు గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న వడగాలులు తోడవడం, అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపదకు మంటలు సులభంగా వ్యాప్తి చెందడానికి ఊతం ఇవ్వడం, కరువుకాటకాలు వెంటాడడం, గాలిలో తేమ తగ్గడం, వర్షపాతం సగటు కన్న చాలా తక్కువగా నమోదు కావడం, ఉష్ణోగ్రతలు అతిగా రికార్డు కావడం, అటవీ ప్రాంతాలకు దగ్గరగా అర్బన్ కాలనీలు నిర్మింపబడడం (వైల్డ్ల్యాండ్-అర్బన్ ఇంచర్ఫేజ్) లాంటి పలు కారణాలతో నేటి కార్చిచ్చు ప్రభావంతో తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. సాధారణంగా మే-అక్టోబర్ వరకు కనిపించే కార్చిచ్చులు నేడు ఏడాది కాలం పాటు కనిపించడం రాబోయే ప్రమాదానికి హెచ్చరికగా తీసుకోవాలి. ఈ సీజన్లో తక్కువగా కనిపించే కార్చిచ్చులు నేడు తీవ్ర స్థాయిలో ఎగిసి పడడంతో అమెరికన్లు సహితం ఆశ్చర్యపోతూ, నిస్సహాయంగా చూస్తూ నిలబడవలసి వస్తున్నది. 2020-21లో నమోదైన కార్చిచ్చుల ఫలితంగా ఇప్పటికే దాదాపు 7 లక్షల హెక్టార్ల ప్రాంతం కాలి బూడిదగా మారిపోతూ బిలియన్ డాలర్ల ఆస్తి నష్టమై కాకుండా ప్రాణ నష్టం కూడా చవి చూడడం గమనించారు. కార్చిచ్చుల ప్రభావం కాలిఫోర్నియా ప్రాంతానికే పరిమితం కాలేదని గమనించాలి. ప్రపంచవ్యాప్తంగా పలు సందర్భాల్లో అనేక దట్టమైన కారడవులు అడవులు అగ్నికి ఆహుతి కావడం చూసాం. వాతావరణ మార్పులతో ప్రతి ఏడాది సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, వర్షపాతం తగ్గడం, వడగాలులు వీచడం, గాలిలో తేమలు తగ్గడం లాంటి పలు కారణాలతో రోజు రోజుకు ప్రపంచ దేశాలు కార్చిచ్చుల రూపంలో అగ్ని ప్రమాదాలకు దగ్గర అవుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరిగిన కొద్దీ కార్చిచ్చుల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. నేడు అభివృద్ధి పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు విడుదల చేస్తున్న విచక్షణారహిత కార్బన్ ఉద్గారాలతో వాతావరణ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, కార్చిచ్చులను ఉసిగొల్పడం కొనసాగుతున్నది. ఎవరు తీసిన గోతిలో వారే పడుతున్నారు.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# సమాచార హక్కు చట్టమా...ఏది నీ దిక్కు?

- నీరు గారుతున్న సామాన్యుడి పాశుపతాస్త్రం
- 18 ఏళ్ల పూర్తి కావస్తున్నప్పటికీ నేటికీ అవగాహనలో విఫలం
- గాలివాటంగా మారిన పారదర్శకత జవాబు దారితనం
- అన్ని పార్టీలకు కంటగింపుగా మారిన చట్టం
- ప్రజలకు అన్ని తెలిసిపోతే తమ పదవులు పోతాయన్న భయం
- దీంతో తుంగలోకి తొక్కేందుకు సిద్ధమైపోయిన నేతలు, అధికారులు

లకావత్ చిరంజీవి
99630 40960

దేశంలోని సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం పాలనలో పారదర్శకత, అధికారులలో జవాబుదారి తనం కోసం కేంద్ర ప్రభుత్వం 2005 లో ఈ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, విద్యాలయాలలో, పురోగతి సమస్యలపై ప్రజాప్రతినిధులే కాకుండా సామాన్యులు సైతం ప్రశ్నించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 18 ఏళ్ల పూర్తి కావస్తున్నప్పటికీ నేటికీ గ్రామాలలో, పట్టణాలలో సామాన్యులకు అవగాహన కల్పించకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు , అధికారులకు ఏం పట్టనట్టు వ్యవహరిస్తుంది. భారత రాజ్యాంగం గణతంత్ర ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. ప్రజలతో ఏర్పడిన ప్రజాస్వామ్యం, అధికారులు పటిష్టంగా పనిచేయాలన్న ఆలోచనతో అవినీతిని అరికట్టాలన్నా, ప్రభుత్వాలు వాటిని ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలన్నా, ప్రజాస్వామ్యంలో పౌరులకు విషయ పరిజ్ఞానం ఉండడం కోసం సమాచారంలో పారదర్శకత చాలా ముఖ్యం. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు . ప్రతి శాఖలో అధికార యంత్రాంగంలో పారదర్శకత జవాబు దారితనం తీసుకురావడం కోసం అధికార యంత్రాంగానికి అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పౌరులకు ఉన్న సమాచార హక్కు చట్టం చేయడం కోసం కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్ నెలకొల్పడం కోసం సంబంధిత ఇతర అంశాల కోసం ఉద్దేశించినది. ఈ సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏమి రహస్యంగా పని చేయకూడదు. దేశ రక్షణ వంటి కొన్ని అంశాల గురించి తప్ప సాధారణ పాలన వ్యవహారాలకు సంబంధించిన దరఖాస్తు అడిగినా ప్రతి వివరాలు అన్ని దరఖాస్తు దారునికి చెప్పి తీరాల్సిందే . ఏమి చేస్తున్నారు ? ఎలా చేస్తున్నారు ? ఏమి చేయబోతున్నారనే సమాచారాన్ని పాలకులు కచ్చితంగా జనానికి చెప్పాలి. అందుకు వీలు కల్పిస్తూ సమాచార హక్కు చట్టం అక్టోబర్, 12, 2005 లో కేంద్ర ప్రభుత్వం తీసుకోరావడం జరిగింది. మొదటిలో కొన్ని సంవత్సరాల పాటు కాస్త పద్ధతి గానే ఈ చట్టం అమలైంది. ఎన్నో అవినీతి భాగోతాలను అది బట్టబయలు చేసింది. దీని దెబ్బకు పార్టీలకతీతంగా పౌరులందరికీ సమాచార హక్కు చట్టం అంటే కంటగింపుగా అయింది. పైకి ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే నాయకులం అని చెప్పుకునే పాలకులు సమాచార హక్కు చట్టం అంటే కడుపులో మంట ఎక్కువైంది. ప్రజలకు అన్ని తెలిసిపోతే తమ పదవులు పోతాయన్న భయం పుట్టింది.

సమాచార హక్కు చట్టం ఆర్టీఐ అమలులో ఆటు ప్రభుత్వం, ఇటు ఆధికారులు ఆరంభంలో చూపిన హడావిడి ఇప్పుడు ఎక్కడ కనిపించడం లేదు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి అందుబాటులో ఉండాలి.

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఈ చట్టం గురించి వివరిస్తూ అప్పట్లో ఏర్పాటు చేసిన డిస్ ప్లే బోర్డులను సైతం కొన్ని కార్యాలయాల్లో, విద్యాసంస్థలలో మూలన పడ్డాయి. ఈ కారణంగా సామాన్య జనాలకు ఇలాంటి చట్టం ఒకటుందాన్నే విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దరఖాస్తు విధానం తెలియక కొందరు తెలిసిన ఎలాంటి సమాచారం అడగాలో తెలియక మరికొందరు అన్ని సక్రమంగా ధరఖాస్తు చేసిన నెల రోజులో సమాచారం ఇవ్వాల్సింది పోయి గడువు దాటినా సమాచారం ఇవ్వడంలో అలస్యం అవుతుంది. వివిధ సమాచారం కోరుతూ అధికారులకు దరఖాస్తు చేస్తే నెల రోజులో సమాచారం ఇవ్వాల్సి పోయి ఏదో ఒక వంకతో దరాఖాస్తు దారులకు తిప్పి పంపడం, సమాచారం లేదని చెప్పడం, సమాచారానికి ఇన్ని పేజీలు అంటూ రుసుము వసూలు చేయడం , లేదంటే వారికి బెదిరించడం ఇలానే కొన్నిచోట్ల జరుగుతూనే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు జిల్లాలలో సమీక్ష సమావేశాలు నిర్వహించినప్పుడు ఉన్నతాధికారుల

సమావేశాలలో కూడా సమాచార హక్కు చట్టం అమలు పై చర్చించిన దాఖలు లేదని స్పష్టంగా చెప్పవచ్చు. ఈ చట్టం గురించి పాలకులకు, అధికారులకు పూర్తిగా అవగాహన లేదు. వివిధ కార్యాలయంలో, విద్యాలయాలలో , సంస్థలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల దగ్గర నుండి ఏ మేరకు ఫీజులు వసూలు చేస్తున్నారు ? , అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారా ? పాఠశాలలో ఫైర్, విద్యార్థులకు ఆడుకోవడానికి ఆటస్థలం, సరిపోను మరుగుదొడ్లు, ప్రభుత్వ గురుకులాలలో విద్యార్థులకు భోజన సమయంలో ఏ విధంగా మోను పెడుతున్నారు ? విద్యార్థులు లేకుండా ఉన్నట్లు రిజిస్టర్ లో నమోదు చేసుకుంటునట్లు , వారి పేరు మీద బిల్లును డ్రా చేస్తున్నట్లు అవినీతిని నిర్మూలించడానికి సమాచారం కోసం దరఖాస్తు చేస్తే సంబంధిత అధికారులే అడిగినా సమాచారం ఇవ్వకుండా దరఖాస్తుదారులు తమను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని దరాఖాస్తు దారులపై ఆసత్య ఆరోపణలు చేసి, వారిపై కేసులు పెడతామని అధికారులే తిరిగి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. దరఖాస్తు దారులు కోరిన సమాచారం ఇస్తే చేసిన అవినీతి మా ఉద్యోగాలు ఎక్కడ ఊడిపోతాయో భయంతోనే అధికారులు సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు.

దరఖాస్తు దారులు కోరినా సమాచారం కోసం గడువులోగా సమాచారం రాక ఎవరికీ ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది దరఖాస్తు దారులు ఇబ్బందులు పడుతున్నారనే మాట నిజం చెప్పగా తప్పడం లేదు. ప్రభుత్వ ఉన్నతా ధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఈ చట్టం రానురాను మరుగున పడిపోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దరఖాస్తు దారుడు కోరిన సమాచారం గడువులోపు ఇవ్వాల్సింది పోయి పైకి సమాచారం ఇవ్వకుండా దరఖాస్తు దారునికి బెదిరించే ధోరణిలకు పాల్పడుతున్నారు. ఈ పాలకులకు తోడు అధికారులకు కూడా ఈ చట్టం పట్ల భయం పట్టుకుంది. అందుకోసం సమచార హక్కు చట్టాన్ని నాశనం చేసే ప్రయత్నాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి . ఆయు-ంవు మీద పట్టు కొడితే ఎంతటి వారైనా విలవిల్లాడిపోతారు. సమాచార హక్కు చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలాగే దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుంది. సామాన్యుడు అడిగిన సమాచారాన్ని ఇచ్చేందుకు అధికారులు మొండికేస్తే ప్రజలు కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ లను ఆశ్రయిస్తారు. అలా దాఖలాలైతే రెండో ఫిర్యాదులను విచారించి సర్కార్ యంత్రాంగం నుంచి జనానికి సమాచారం ఇప్పించడం కమిషన్ ల యొక్క మొదటి కర్తవ్యం. ఈ చట్టం నిబంధనలను పాటించని అధికారులపై జరిమాన విధించే పని ఈ కమిషన్ లదే. అంతటి కీలకమైన కమిషన్ పోస్ట్ ఖాళీగా ఉంటే మరి సామాన్యులు ఎవరికి పిర్యాదు చేయాలనే సందిగ్ధంలో పిర్యాదు దారులు ఉన్నారు. అవినీతి నిర్మూలనకు అరికట్టేందుకు కృషి చేయాలి. ఆర్టీఐ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుండి ప్రజలకు, అధికారులకు పూర్తిగా అవగాహన లేదు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా అధికారి, అప్పిలేట్ అధికారి అందుబాటులో ఉన్నప్పటికీ సమాచారం ఇవ్వడానికి వెనకాడుతున్నారు.




### అడిగినా సమాచారం ఇవ్వడం లేదు

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఒక వజ్రాయుధం లాంటిది. అవినీతి నిర్మూలనకు బీజం వేసి జవాబుదారితనం పెంచే ఈ చట్టం యొక్క ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం అవినీతి లేని సమాజాన్ని నిర్మించాలని సంకల్పంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం గొప్పగా సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది. సమాచార హక్కు చట్టం కమిషన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవడం వలన అధికారులకు వచ్చిన ఆర్టీఐ ధరఖాస్తులను వచ్చినట్లుగా తిరిగి దరఖాస్తు పంపిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కమిషన్ లేనందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో, విద్యాలయాలలో దాగిన అక్రమాలు బయటకు రావు. సమాచార హక్కు చట్టం ప్రకారం కేంద్రంలో ప్రతి రాష్ట్రంలోని ప్రధాన సమాచార కమిషనర్ తో పాటు పదిమందికి మించకుండా కమిషన్ సభ్యులు ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అవి పట్టించుకోవడం లేదు. కానీ చాలా రాష్ట్రాలలో ఈ కమిషన్ ఖాళీగా ఉండడం వల్ల ప్రభుత్వంలో చోటు చేసుకున్న అక్రమాలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఇలా కమిషన్ లేక విచారణలు జరగక ఆ ఫిర్యాదు దారుల దరఖాస్తులు విపరీతంగా పెండింగ్ లో పడుతున్నాయి. సామాన్యుల పట్ల పారదర్శకంగా ఉండాల్సిన ప్రభుత్వాలు జనం కళ్ళు గప్పి పబ్బము గడుపుకుంటున్నాయి. సమాచార హక్కు చట్టం కమిషన్ నియామకాల్లో ప్రభుత్వాల వైఫల్యం కారణంగా సమాచార హక్కు చట్టం నిర్వీర్యం అవుతుందని గతంలో సుప్రీంకోర్టు చాలా సందర్భాలలో గుర్తు చేయడం జరిగింది. వివిధ రాష్ట్రాలలో తక్షణమే ఖాళీగా ఉన్న ఆ కమిషన్ పోస్టులను భర్తీ చేపట్టాలని ఆదేశించింది. సమర్థులు, అధికార పక్షాలతో సంబంధం లేని వారు, భిన్న రంగాలకు చెందిన ప్రజ్ఞా వంతులు కమిషన్ అయితేనే సమాచార హక్కు దరఖాస్తు దారులకు న్యాయం జరుగుతుందని చెప్పవచ్చు. అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని నమ్మకం కలుగుతుంది

ప్రజలు వివిధ సమాచారం కావాలని కోరుతూ అధికారులకు దరఖాస్తు చేస్తే నెల రోజులోపు సమాచార ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఏదో ఒక వంకతో దరఖాస్తు దారులకు తిప్పి పంపడం లేదా సమాచారం లేదని చెప్పడం సమాచారానికి ఇన్ని పేజీలు అంటూ వసూలు చేయడం జరుగుతుంది. ఓ వసతి గృహంలోని వసతిగృహ అధికారి (వార్డెన్) ఇంచార్జి కాబట్టి నా ఇష్టం వచ్చినట్టు వస్తాను అన్నట్లు వసతిగృహానికి వచ్చి పోతుంటారు. విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదు . పూర్తిస్థాయిలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదు . వసతిగృహంలో అవినీతి జరుగుతోందని జిల్లా అధికారులకు పిర్యాదు చేసినాను. వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రేమ చూపిస్తున్నారు. వారి అవినీతి మరింతగా ఎక్కువగా కనిపిస్తున్నాయి. విద్యార్థులు లేకున్నా ఉన్నట్లు రిజిస్టర్ లో నమోదు చేసుకుంటున్నారు. కాబట్టి ఈ అంశాలపై సమాచారం హక్కు చట్టం ప్రకారం ప్రజా సమాచార అధికారి గారికి సమాచారం కోరితే రెండు నెలలు దాటినా సమాచారం ఇవ్వలేదు. అడిగినా సమాచారం ఇవ్వడం లేదని అప్పిలేట్ అధికారి కి దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా దరఖాస్తు దారునికి సమాచారం అందజేయకుండా వార్డెన్ ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# నైపుణ్యాలతో కూడిన యువభారతమే దేశ భవిత !

- దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి
- చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలకు వెలుగు
- నైపుణ్య విద్య ప్రయోజనాలు అనేకం ని యువతరం గ్రహించాలి
- స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్ అత్యవసరం అని ప్రభుత్వాలు గుర్తించాలి
- దేశ విద్యా వ్యవస్థ నాణ్యతలో కొరత అన్నది సుస్పష్టం అయినా పరిమాణంలో ఘనత మనది

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037:



దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తి కాదు, మేధో వ్యవస్థ. సమాజ గతిని మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం. స్వతంత్ర భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఏఐసిటిఈ, ఐఐఎస్సి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ/బాలికల నిర్భంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేసిన నాయకుల దార్శనికత కొనియాడదగింది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావులు మన దేశంలో అనేకులు ఉన్నారు.

విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాణి తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి.


ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడించ్ హాబిట్ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం-2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 459 రాష్ట్ర యూనివర్సిటీలు, 126 డీమ్డ్ యూనివర్సిటీలు, 430 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్కు చెందిన 91 యూనివర్సిటీలు మాత్రమే ఉండడం విచారకరం.

భారత్లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలుపుతూ యువభారతం నిరుద్యోగంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్దులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రేట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలురంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

# యుగ పురుషుడు వివేకానందుడు

భారతదేశ సంస్కృతిని, ఆద్యాత్మిక చింతనను, విదేశాలకు చాటి చెప్పి న మహోన్నత వ్యక్తి స్వామి వివేకా నంద. ఉపన్యాసాల ద్వారా భారత యోగ, వేదాంత శాస్త్రాలను ఖండాం తరాలు దాటించిన వ్యక్తి ఆయన. అమెరికాలోని చికాగోలో, ఇంగ్లాండులో ఆనాడు చేసిన ఆయన ప్రసంగాలను భారత సమా జం గర్వంగా గొప్పగా నేటికీ గుర్తు చేసుకుంటునే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో అడుగు పెట్టిన తొలి హిందూ సన్యాసి కూడా వివేకానందనే కావడం విశేషం. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం'... 'లేవండి..మేల్కోండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి' వంటి వివేకానంద సూక్తులు ఇప్పటికీ ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానందుని వ్యక్తిత్వాన్ని ఆయన జయంతి సందర్భంగా భారతీయులు ఏటా స్మరించు కుంటున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ భారత ప్రభుత్వం వివేకా నంద జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపు తోంది. స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించా రు. జులై 4, 1902న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చాత్య , తత్వ శాస్త్ర గ్రంధాలు, నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంధాలు, ఇలా ఎన్నో చదివే వారు. జీవించింది కేవలం 39 సంవత్సరాలే కానీ శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేశారు. తూర్పు మరియు పశ్చిమ సంస్కృ తుల మధ్య ఒక వారధి నిర్మిం చారు. మన దేశానికి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తన కంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి "స్వామి వివేకానంద స్ట్రీట్" అని పేరు పెట్టు కున్నారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతో మంది స్వాతంత్ర యోధులకు వివేకానందుడే ఆదర్శం. . "మీరు ఇండియా గురించి తెలుసు కోవా లను కుంటే స్వామి వివేకానంద గురించి చదవండి" అన్నారు విశ్వకవి టాగోర్. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి తద్వారా భారతీయ యువతకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని, యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనే వారు. అందుకే "డబ్బు లేని వాడు కాదు... జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేద వాడు" అనే వారు వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా "గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతక మని" దేనికి భయపడవద్దని చెపుతుండే వారు."ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను" అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను "నేషనల్ యూత్ డే" గా జరుపు కుంటారు. ఆయన తన ప్రసంగా లతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్దేశం చేశారు.వ్యక్తి విజయవంతమైన జీవితం గడపడానికి కొన్ని సూత్రాలను వివేకానందుడు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలతో వ్యక్తిలో నిస్వార్థమైన వైఖరులు ఏర్పడ తాయని



వివరించారు. సుఖదు:ఖాలు నాణేనికి రెండు పార్శ్వాలు లాంటివి. కాబట్టి సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. విశ్వంలో ప్రతి అంశం తార్కిక ఆలోచనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి తార్కిక ఆలోచ నలతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి. ఇతరులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి. మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు.. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు. కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు. మతం అనేది సిద్ధాంత రాద్ధాం తాలలో లేదు... అది ఆచరణలో ఆధ్యాత్మికులుగా పరిణతి చెంద డంలో మాత్రమే ఉంది. ఈ ప్రపంచం బలవంతులకు మాత్రమే సహాయ పడుతుంది.. ఇలా యువతకు వివేకానందుడు స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. జీవితం నిరాశ నిస్పృ హలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమి చెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు స్వామి వివేకానందకు సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవాలి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగుతుంది. జీవితానికి అసలైన అర్థం తెలు స్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహా నీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494

# 'ఆప్-దా' నుంచి ఫిబ్రవరి 5న విముక్తి

● "జుగ్గి బస్తీ ప్రధాన్ సమ్మేళన్"లో అమిత్‌షా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'ఆప్'ను విపత్తు (ఆప్-దా)గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించినప్పటి నుంచి బీజేపీ నేతలు ఆ పదాన్ని విరివిగా వాడుతున్నారు. కేజ్రీవాల్ ఢిల్లీకి మాత్రమే కాకుండా ఆయన పార్టీకి కూడా విపత్తేనని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ఒక చెడు రాజకీయనేతకు ఎన్ని అవలక్షణాలు ఉంటాయో అన్నీ ఆయనకు ఉన్నాయని, ఆయన దేశంలోనే నెంబర్ వన్ అవినీతి నేత అని విమర్శలు గుప్పించారు.

శనివారంనాడిక్కడ జేఎల్ఎన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన "జుగ్గి బస్తీ ప్రధాన్ సమ్మేళన్"లో అమిత్‌షా పాల్గొన్నారు. "ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదంటూ స్లమ్ వాసుల ఆవేదన, ఆగ్రహం బీజేపీ ఆలకించింది. మీ సమస్యలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన మంత్రి మోదీ ముందుకు తీసుకెళ్లింది. ఆ సమస్యలన్నింటికీ ఉపశమనం మా మేనిఫెస్టిలో ఉంటుంది. బీజేపీ మేనిఫెస్టో అంటే ప్రధాన మంత్రి గ్యారిటీ. 'ఆప్-దా' మేనిఫెస్టో తరహాలా ఉండదు.

మేము చేసేదే చెబుతాం" అని అమిత్‌షా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగే ఫిబ్రవరి 5వ తేదీతో 'ఆప్-దా' నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని అమిత్‌షా జోస్యం చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించిన వాళ్లే (ఆప్) అవినీతి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టారని, ఢిల్లీకి 'ఆప్' ఒక విపత్తు అయితే, అరవింద్ కేజ్రీవాల్ సొంత పార్టీకి (ఆప్)కి కూడా విపత్తేనని వ్యాఖ్యానించారు.



# వ్యూస్‌లోనే కాదు..
# ఆదాయంలోనూ టాపే

● ప్రధాని మోడీ యూట్యూబ్ ఛానెల్ కు ప్రతి నెలా భారీ ఆదాయం
● ఇప్పటి వరకు 29,272 వీడియోలు అప్‌లోడ్ ● 36 కోట్ల 33 లక్షలకు పైగా వ్యూస్ ● గుజరాత్ సింఎంగాగా ఉన్నప్పుడే యూట్యూబ్ ఛానెల్‌తో ప్రజలకు చేరువ





న్యూఢిల్లీ : సోషల్ మీడియాలో ప్రధాని మోదీ చాలా చురుగ్గా ఉంటారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నేటి యువతరానికి దగ్గర కావడానికున్న మార్గాన్ని అయన లాంటి వ్యక్తులు అస్సలు మిస్ చేసుకోరు. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి పీఎం అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత.. మోదీ వాడినట్లు సోషల్ మీడియాను ఎవరూ వాడలేదు అనుకోవచ్చు. మీడియా ఇంటర్వ్యూలకి, సమావేశాలకు దూరంగా ఉండే ప్రధాని మోదీ.. సోషల్ మీడియా ద్వారా మాత్రం యాక్టీవ్ గా ఉంటుంటారు. మరి.. మన ప్రధాని యూట్యూబ్ ఛానెల్ ప్రత్యేకతలు ఎంటో ఎప్పుడైనా ఆలోచించారా.? ఈ ఛానెల్ ద్వారా ఆయన నెలకు ఎంత సంపాదిస్తున్నారో తెలుసా.? తెలియకపోతే.. ఈ స్టోరీ చదివేయండి.భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఛానెల్ వంటి వివిధ సోషల్ మీడియా అకౌంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఆయన నిత్యం అందుబాటులో ఉంటూ ఉంటారు. తన ప్రోగ్రాములు, అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు సహా.. అన్ని కార్యక్రమాల్ని ఈ ఛానెళ్ల ద్వారా ప్రసారం చేస్తుంటారు. దాంతో.. ఆయనను ఆయా ఛానెళ్ల ద్వారా ఫాలో అయ్యే వాళ్లు చాలా మందే ఉన్నారు. నరేంద్ర మోదీ అనే పేరుతో ఆయనకు అధికారిక యూట్యూబ్ ఛానెల్ ఒకటుంది. ఈ ఛానెల్ అక్టోబర్ 26, 2007న ప్రారంభించారు. అంటే ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే యూట్యూబ్ ఛానెల్ ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ప్రధాని అయిన తర్వాత పేరు మార్చారు. ఈ ఛానెల్ కు 26.5 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అంతర్జాతీయంగా యూట్యూబ్‌లో 20 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్‌లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. అంతే కాదు.. ఛానెల్ వ్యూస్, లైక్స్ ద్వారా భారీగానే సంపాదిస్తోంది.. ప్రధాని యూట్యూబ్ ఛానెల్. యూట్యూబ్ ఛానెల్ స్ట్రీమింగ్ సమాచారాన్ని అందించిన ఓ వెబ్ సైట్ సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ అధికారిక ఛానెల్ కు నెలకు 1,89,000 డాలర్ల నుంచి 5,67,100 డాలర్ల మధ్య ఆదాయం వస్తుంది. అంటే.. మన భారత కరెన్సీలో రూ. 1 కోటీ 62 లక్షల నుంచి రూ. 4 కోట్ల 87 లక్షల మధ్యలో ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఛానెల్ లో ఇప్పటి వరకు 29,272 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 636 కోట్ల 33 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇలా.. రాజకీయ నేతల సోషల్ మీడియా రికార్డ్స్ లో.. మన ప్రధాని రికార్డ్సే ముందు వరుసలో ఉంటాయి మరి. ప్రధాని మోదీ ఛానెల్‌లో అప్‌లోడ్ చేసిన చాలా వీడియోలు 40 వేల కంటే ఎక్కువగానే వ్యూస్ సాధిస్తుంటాయి. అలాగే.. ఎక్కువ సబ్‌స్క్రైబర్లు, వ్యూస్ కారణంగా.. ప్రధాని మోదీ యూట్యూబ్ ఛానెల్ భారీగానే ఆదాయాన్ని ఆర్జిస్తుంది. ప్రతి వారం సగటున 19 వీడియోలు అప్‌లోడ్ చేస్తుండాగ.. ప్రధాని మోదీకి ఫేస్‌బుక్‌లో 48 మిలియన్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 82.7 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రధాని మోదీ తర్వాత%8‌%%% బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో 6.4 మిలియన్లతో యూట్యూబ్ సబ్‌స్క్రైబర్‌ల పరంగా రెండో ర్యాంకులో ఉన్నారు. కానీ.. మోదీ ఫాలోవర్లతో పోల్చితే..నాలుగో వంతు మాత్రమే.

# మోదీజీ.. రూపాయి పతనంపై
# మీ సమాధానమేంటి?

● కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ నిలదీత



డిల్లీ: అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా తగ్గిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాల న్నారు. శుక్రవారం రూపాయి విలువ ఒక్కసారిగా 16 పైసలు క్షీణించి చరిత్ర లోనే తొలిసారిగా 86.04కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. "చరిత్రలోనే తొలిసారిగా రూపాయి మారకం విలువ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో డాలరుతో రూపాయి మారకం విలువ 58-59 గా ఉండేది. అప్పట్లో నరేంద్ర మోదీ రూపాయి విలువను ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపెట్టేవారు. డబ్బు విలువ ఏ దేశంలోనూ ఇంతగా పడిపోదని, అంతా తనకే తెలుసని చెప్పేవారు. మరి ఇప్పుడేమైంది. ఆయనే ప్రధానిగా ఉన్నారు. పతనంలో రూపాయి రికార్డులు సృష్టిస్తోంది. రోజు రోజుకూ దాని విలువ పడిపోతోంది. అందువల్ల దేశ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలి" అని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

# అరవిందా! ఎంతపని చేస్తివి...

● తెలుగు రాష్ట్రాలకూ పాకిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు
● ఢిల్లీ మద్యం పాలసీతో రూ.2,026 కోట్ల నష్టం
● కాగ్ సంచలన నివేదిక!




ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 5న ఎన్నికలు జరుగనున్నాయి. ఈమేరకు ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు అధికార ఆప్ మరోసారి గెలవాలని ప్రయత్నిస్తోంది. ఇక ఈసారి ఢిల్లీలో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ కష్టపడుతోంది. ఈ తరుణంలో విడుదలైన కాంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రిపోర్టు ఇప్పుడు మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కు తలనొప్పిగా మారే అవకాశం ఉంది. ఢిల్లీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీలోని లోపాలను ఇందులో వివరించింది. మద్యం పాలసీ మార్పుతో ప్రభుత్వ ఖజానాకు రూ.2,026 కోట్ల నష్టం జరిగిందని నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం దేశ రాజధానిలో మద్యం వాపారం నష్టాల్లో ఉన్నప్పటికీ ఆప్ ప్రభుత్వం కొంత మంది బిడ్డర్లకు లైసెన్స్‌లు ఇచ్చిందని ఆకంగ్రె పేర్కొంది. పాలసీ అమలులోని లోపాలను ఈ నివేదిక ప్రస్తావించింది. ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల కారణంగా సర్కార్‌కు రూ.2,026 కోట్ల నష్టం వాటిలిందని తెలిపింది. ఈ నష్టానికి సామాన్యులు మూల్యం చెల్లించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆప్ నేతలు మాత్రం భారీగా కమీషన్లు అందుకున్నట్లు తెలిపింది.

**నేతల పేర్లు కూడా :** కాగ్ నివేదికలో కొంత మంది నేతల పేర్లు కూడా పేర్కొంది. నాటి ఎక్సైజ్ మినిస్టర్‌గా వ్యవహరించిన మనీష సిసోడియాతోపాటు అతని మంత్రుల బృందం నిపుణుల ప్యానెల్ సిఫారసులను విస్మరించిందని నివేదిక వెల్లడించింది. మద్యం దుకాణాల లైసెన్సుల జారీ నిబంధనలు ఉల్లంఘించారని తెలిపింది. కీలక నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని పేర్కొంది. కేబినెట్ నుంచి గానీ, గవర్నర్ నుంచి ఆమోదం తీసుకోలేదని తెలిపింది.

**కాగ్ పేర్కొన్న కీలక అంశాలు...**

* కొత్త మద్యం పాలసీ, విధానంలో లోపాల కారణంగా రూ.2,026 కోట్ల నష్టం జరిగింది. * మద్యం విధానం రూపొందించే ముందు నిపుణులను సంప్రదించలేదు. కానీ వారి సిఫారసులను కూడా పాటించలేదు. * ఫిర్యాదులు ఎదుర్కొంటున లేదా నష్టాల్లో నడుస్తున్న కంపెనీలకు కూడా లైసెన్సులు జారీ చేశారు. * అనేక కీలర నిర్ణాయలలో క్యాబినెట్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తీసుకోలేదు. * మద్యం ధరల విషయంలో, లైసెన్సుల జారీ విషయంలో పారదర్శకత లోపించింది. * మద్యం నాణ్యతను తనిఖీ చేయడానికి ప్రయోగ శాలలు, పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఉన్నవాటిలో సౌకర్యాలు * కల్పించలేదు. ఇక రిటైల్ షాపులను అన్ని ప్రాంతాలకు సమానంగా పంపిణీ చేయలేదు. * కోవిడ్ 19 పేరుతో రూ.144 కోట్ల విలువైన లైసెన్స్ ఫీజులను మాఫీ చేశారు. అయితే అలా చేయాల్సిన అవసరం లేదు. * జోనల్ లైసెన్స్‌దారులు ఇచ్చిన రాయితీల ఫలితంగా రూ.941 కోట్ల నష్టం జరిగింది. * సెక్యూరిటీ డిపాజిట్లు సరిగా రికవరీ చేయకపోవడంతో రూ.27 కోట్ల నష్టం జరిగింది. * ఉపసంహరించిన లైసెన్సులకు టెండర్లు పిలవకపోవడంతో రూ.890 కోట్ల నష్టం జరిగింది. * కోవిడ్ సాకుతో ప్రభుత్వం రూ.144 కోట్ల లైసెన్స్ ఫీజు మాఫీ చేసింది. దీంతో మరింత ఆదాయం తగ్గింది. * సెక్యూరిటీ డిపాజిట్‌ను తప్పుగా డిపాజిట్ చేయడం వలన రూ.27 కోట్ల నష్టం జరిగింది.

# బంగ్లా సరిహద్దులో స్మగ్లింగ్ యత్నం

### భగ్నం చేసిన భారత్ సైన్యం



మాల్దా: బంగ్లాదేశ్‌కు చెందిన సాయుధ మూకల స్మగ్లింగ్ యత్నాలను భారత్ సైన్యం భగ్నం చేసింది. శనివారం తెల్లవారు జామున 2.10 సమయంలో దాదాపు 15-20 మంది సాయుధులు భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. పసిగట్టిన సరిహద్దు భద్రతా సిబ్బంది వారిని పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోకుండా సరిహద్దు వైపు దూసుకొచ్చారు. జవాన్ల కళ్లు బైర్లు కమ్మేలా అత్యంత శక్తివంతమైన కాంతిని ప్రసరించే హై బీమ్ ఫ్లాష్‌లైట్లను వినియోగించారు. అంతలోనే జవాన్లపై మారణాయుధాలతో దాడికి దిగారు. తొలుత వారిని భయపెట్టేందుకు జవాన్లు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వెనక్కి తగ్గకపోవడంతో ఆత్మరక్షణ కోసం బీఎస్ఎఫ్ సిబ్బంది కూడా ప్రతిదాడి చేశారు. దీంతో వారంతా తోకముడుచుకొని తిరిగి బంగ్లాదేశ్‌వైపు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా.. 572 సీసాల ఔషధాలు,హైబీమ్ ఫ్లాష్‌లైట్లు, ఆయుధాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులు ప్రకటన విడుదల చేశారు. మరోవైపు ముర్షిదాబాద్, మాల్దా జిల్లాల పరిధిలోని బంగ్లాదేశ్ సరిహద్దు గుండా అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించేందుకు బంగ్లాదేశీయులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ సిబ్బంది భగ్నం చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశించేందుకు అవకాశమున్నందున నందన్‌పుర్, ఫార్జిపరా, హరినాథ్‌పుర్, చురియంత్‌పుర్ అవుట్‌పోస్టుల్లో భద్రతను బీఎస్ఎఫ్ మరింత కట్టుదిట్టం చేసింది.

# లొంగిపోయిన 9మంది నక్సలైట్లు

● ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఘటన
● భద్రతా బలగాలపై అనేక దాడులు చేసిన వారే
● 103 మంది జవాన్లను పొట్టన బెట్టుకున్న నక్సల్స్



సుక్మా: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో తొమ్మిది మంది పేరుమోసిన నక్సలైట్లు శనివారం లొంగిపోయారు. వీరంతా భద్రతా బలగాలపై అనేక దాడులకు పాల్పడ్డారు. ఈ నక్సలైట్లకు ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇచ్చి ప్రభుత్వ విధానం ప్రకారం.. పునరావాసం కల్పిస్తారు. గతేడాది బస్తర్ ప్రాంతంలో 792 మంది నక్సలైట్లు లొంగిపోయారు. సుక్మాతో సహా ఏడు జిల్లాలు ఈ ప్రాంతంలో వస్తాయి. ఇద్దరు మహిళలు సహా తొమ్మిది మంది నక్సలైట్లు పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. మావోయిస్ట్ భావజాలం బోలు, అమానవీయ స్వభావం, సంస్థలో కొనసాగుతున్న అంతర్గత కలహాల వల్ల వారు నిరాశ చెందారు. పోలీసు శిబిరాల ఏర్పాటు కారణంగా, సీనియర్ నక్సలైట్లు వెనక్కి తగ్గారు.

మావోయిస్టు ప్లాటూన్ నంబర్ 24 కమాండర్ రాంసాయి అలియాస్ ఓయామ్ బుస్కా (34), ప్రదీప్ అలియాస్ రవ్వ రాకేష్ (20)పై రూ.8 లక్షల రివార్డు ఉంది. మరో నలుగురు నక్సలైట్లపై రూ.5 లక్షల రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు. మహిళా నక్సలైట్‌పై మూడు లక్షల రూపాయల రివార్డు ఉంది. ఒక మహిళతో సహా మరో ఇద్దరిపై రూ.2 లక్షల చొప్పున రివార్డు ప్రకటించారు. 2007లో నారాయణపూర్ జిల్లాలోని ఝురా వ్యాలీలో జరిగిన ఆకస్మిక దాడితో సహా అనేక ప్రధాన దాడుల్లో నక్సల్ కమాండర్ రాంసాయ్ పాల్గొన్నాడు. ఈ ఘటనలో ఏడుగురు పోలీసులు చనిపోయారు. పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. దీనితో పాటు.. 2007 సంవత్సరంలో రాణిబోడ్లి (బీజాపూర్ జిల్లా) దాడిలో 55 మంది భద్రతా సిబ్బంది మరణించారు.

2017లో బుర్కాపాల్ (సుక్మా)లో ఆకస్మిక దాడి జరిగింది. ఇందులో 25 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. 2020 సంవత్సరంలో మిన్పా ఆకస్మిక (సుక్మా) దాడిలో 17 మంది భద్రతా సిబ్బంది వీర మరణం పొందారు. లొంగిపోయిన ఇతర నక్సలైట్లు కూడా భద్రతా బలగాలపై అనేక దాడుల్లో పాల్గొన్నారు.

**నక్సలైట్ల పేర్లు, రివార్డులు....**

1. రాన్సే అలియాస్ మనోజ్ అలియాస్ ఓయం బుస్కారూ. 8 లక్షలు 2. ప్రదీప్ అలియాస్ రవ్వ రాకేష్ రూ. 8 లక్షలు 3. కవాసి సోనా రూ. 5 లక్షలు 4. నవీన్ అలియాస్ సోడి మంగ రూ. 5 లక్షలు 5. మడ్కం జోగా రూ. 5 లక్షలు 6. ముచ్చకీ దేవా రూ. 5 లక్షలు 7. మద్వి సుక్కి రూ. 3 లక్షలు 8. కరాటం వెలి రూ. 2 లక్షలు 9. మద్వి రాకేష్- రూ. 2 లక్షలు

### మిలియన్ల డాలర్ల విలాస భవనం..
# అగ్నికి ఆహుతి..!

**సంపదతో తులతూగిన లాస్ ఏంజెలెస్ నగరం బుగ్గి**



లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ ప్రాంతంలో కార్చిచ్చు ఎన్నో ఇళ్లను బుగ్గి చేసింది. ఈ విలయం పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో అత్యంత ఖరీదైన భవనాన్ని శిథిలంగా మార్చింది. ఆ మాన్షన్ విలువ సుమారు 125 మిలియన్ డాలర్లు (రూ.1,077 కోట్లకుపైనే). ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి 18 పడక గదుల ఈ విలాస భవనం లుమినార్ టెక్నాలజీస్ సీఈఓ ఆస్టిన్ రస్సెల్ దీనిని అద్దెకు ఇస్తే.. రూ 3కోట్లపైనే వస్తోంది.

సక్సెషన్ అనే టీవీ సిరీస్‌లో ఈ ఇల్లు కనిపిస్తుంది. దాంతోనే ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. కానీ ఇప్పుడు అబ్బురపరిచే ఫర్నీచర్, సుందరమైన గార్డెన్స్ అన్నీ బూడిదగా మారిపోయాయి. అయితే ఈ ఇంటి గురించిన కథనాల్లో పూర్తిస్థాయి ధ్రువీకరణ లేదు.

**పరిమితులు దాటి.. వేడెక్కుతున్న భూగోళం :**

ఈ కార్చిచ్చు తో సంపదలతో తులతూగిన లాస్ ఏంజెలెస్ నగరం నేడు మరుభూమిని తలపిస్తోంది. ఇక్కడ ఎగసిపడుతున్న పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఎటు చూసినా పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. ఆస్తి నష్టం సుమారు 150 బిలియన్ డాలర్లకు పెరగొచ్చని ఆక్యూవెదర్ సంస్థ అంచనా వేసింది. అమెరికా బీమా రంగం కూడా ఈ కార్చిచ్చు దెబ్బకు కుదేలయ్యే పరిస్థితి నెలకొంది. జేపీ మోర్గాన్, మార్నింగ్ స్టార్ అంచనాల ప్రకారం 20 బిలియన్ డాలర్ల వరకు బీమా సంస్థలకు నష్టం రావచ్చని పేర్కొంది. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమా సంస్థ స్టేట్ ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం మానేసింది.

# దివాళా తీసిన పాకిస్తాన్‌కు అదృష్టం

● సింధూ నది సమీపంలో భారీ బంగారు నిధి గుర్తింపు



పెషావర్: ఆర్థికంగా కుంగిపోయి దివాళా తీసిన పాకిస్తాన్‌కు అనూహ్యంగా అదృష్ట దేవత కరుణించింది. పాకిస్తాన్ భూభాగంలోని సింధూ నది సమీపంలో భారీ బంగారు నిల్వలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్తాన్ ప్రకటించింది. పంజాబ్ రాష్ట్రంలోని అట్టోక్ జిల్లా భూభాగంలోని సింధూ నదిలో 32.6 మెట్రిక్ టన్నుల బంగారం నిధి ఉందని.. ఆ నిధి విలువ సుమారు 600 బిలియన్ పాకిస్తానీ రూపాయలని పేర్కొంది. (భారత్ కరెన్సీలో రూ.18 వేల కోట్లకు పైనే) కొన్ని నెలల క్రితమే చైనా భూభాగంలో కూడా రూ.7 లక్షల కోట్ల బంగారు నిల్వలు ఉన్నట్లు తెలిసింది. చైనా జాతీయ మీడియా ప్రకారం పింగ్ జియాంగ్ కౌంటీలో 1000 మెట్రిక్ టన్నుల హై క్వాలిటీ బంగారం ఉన్నట్లు గుర్తించారు. ఈ బంగారం విలువ సుమారు రూ.6,91,473 కోట్లు అని అంచనా. ప్రపంచలోనే ఇంత పెద్ద మొత్తంలో బంగారు నిల్వలు బయటపడడం ఇదే తొలిసారి. పాకిస్తాన్ దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. దేశ ఖజానాలో విదేశీ కరెన్సీ నిల్వలు ఆవిరైపోయాయి. యువతకు ఉద్యోగాలు లేక, ప్రజలు ఆహారం లభించక విలవిల్లాడుతన్న పరిస్థితి. ఇలాంటి తరుణంలో అనుకోకుండా పాకిస్తాన్ జియోలాజికల్ సర్వే కంటికి భారీ బంగారు నిధి కనిపించింది. సిందూ నదిలో బయటపడిన బంగారు నిల్వలతో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పెట్టేందకు ఓ మార్గం లభించింది. సింధూ నదిలో బంగారు నిల్వలు కనుగున్నట్ల ముందుగా పాకిస్తాన్ లోని పంజాబ్ రాష్ట్ర మైనింగ్ మంత్రి ఇబ్రహీం హసన్ మురాద్ ప్రకటించారు. జియోలాజికల్ సర్వేలో ఈ విషయం బయటపడిందన్నారు. ఈ ప్రకటనలో అక్కడ కొంతమంది అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అక్రమ తవ్వకాలను నిరోధించడానికి ప్రభుత్వం మైనింగ్ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభించనుందని మీడియా తెలిపింది.



### మహిళా శిశు సంక్షేమంలో
# ఆదర్శంగా తెలంగాణ

● పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు
● కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలి
● పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర భాగస్వామ్యం పెంచాలి
● బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడిలకు గుడ్డును దూరం చేశారు ● పోషకాహారం అందించే దిశలో కేంద్ర బడ్జెట్ పెరగాలి
● ఉదయపూర్ చింతన్ శివిర్ లో స్పష్టం చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
● మంత్రి సీతక్క ప్రసంగానికి చివర్లో చప్పట్లతో సమర్థన

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాజస్థాన్ రాష్ట్రంలో ని ఉదయపూర్ పట్టణంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన చింతన్ శివిర్ లో మంత్రి సీతక్క ప్రసంగించారు. కేంద్ర మహిళా సి సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితోపాటు, అన్ని రాష్ట్రాల మహిళా సి సంక్షేమ శాఖ మంత్రులు అధికారులు హాజరైన ఈ సదస్సుకు మహిళా శి సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ లతో కలిసి మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళా శిశు సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక పథకాలు, సాధించిన పురోగతి, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారం పై మంత్రి సీతక్క మాట్లాడారు. చిన్నారుల, గర్భిణులు బాలింతలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు పోషిస్తున్న పాత్రను వివరించారు. ఆదివాసి బిడ్డగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆకలికి మించిన శత్రువు లేదన్న జాతిపిత మాహాత్మ గాంధీ స్ఫూర్తితో.. తెలంగాణలో ప్రత్యేకంగా ఆరోగ్యలక్ష్మి అనే పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతిరోజు 200 ఎంఎల్ పాలతో పాటు అదనపు గుడ్డును అందిస్తున్నట్టు తెలిపారు. అందుకోసం ఏటా రూ. 296 కోట్ల ను ఖర్చు చేస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. అంగన్వాడి చిన్నారులకు సైతం పాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. బాలామృతం ప్లస్ ద్వారా పోషకాహార లోపం ఉన్న పిల్లలకు, ప్రత్యేక పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అయితే పోషకాలు అధికంగా ఉన్న కోడిగుడ్లను బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడి కేంద్రాల్లో పంపిణీ చేయడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లను ఇచ్చేందుకు సంస్కృత కారణాలు అడ్డుగా ఉంటే, కోడిగుడ్డు స్థానంలో అధిక పోషకాలు ఉండే ఇతర ప్రత్యామ్నాయ పదార్థాలను అందివ్వాలని, అనుగుణంగా కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. చిన్నారులు, పిల్లలు దేశ వనరులని, వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్న పండిట్ జవహర్లాల్ నెహ్రూ వ్యాఖ్యలను గుర్తు చేశారు. తెలంగాణలో 35,700 అంగన్వాడి కేంద్రాలను నడుపుతున్నట్లు తెలిపిన మంత్రి సీతక్క, జాతీయ విద్యా విధానం, 2020 కి అనుగుణంగా అంగన్వాడి కేంద్రాల్లో అహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు అంగన్వాడి కేంద్రాలకు ఫర్నిచర్, ఆట వస్తువులను సరఫరా చేయటంతో పాటు రంగురంగుల పెయింటింగ్స్ తో అంగన్వాడి కేంద్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్వయం సహాయక బృందాల మహిళలచే అంగన్వాడి చిన్నారులకు రంగురంగుల యూనిఫామ్ దుస్తులను ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి విజయాలను మంత్రి వివరించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక శక్తులుగా తీసినందుకు వారిచే సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆర్టీసీ బస్సులను, క్యాంటీన్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా లక్షల సంఖ్యలో యూనిఫామ్ లను కుట్టించి సరఫరా చేసినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా అంగన్వాడి సిబ్బందికి వేతనాలు అందిస్తున్న ది తెలంగాణ ప్రభుత్వమని మంత్రి సీతక్క గుర్తు చేశారు. అయితే పెరిగిన ధరలు, జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాలకు తగ్గిన ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం తన వాటాను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటాగా అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడి హెల్పర్ల గౌరవేతనాలను రూ. 10 వేలు, రూ. 7 వేలకు పెంచాలని కోరారు.

తెలంగాణ తరహాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని సూచించారు. తెలంగాణలో మహిళా సంక్షేమం కోసం 15.26 లక్షల మంది విడోలకి , 1.41 లక్షల ఒంటరి మహిళలకు నెలకు రూ. 2000 పెన్షన్ను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే విడోలకి ఇస్తున్న పెన్షన్ లో కేంద్రం తన వాటాగా 200 రూపాయలు మాత్రమే ఇస్తోందని, గత పది ఏళ్లుగా ఈ మొత్తం పెరగలేదని గుర్తు చేసిన మంత్రి సీతక్క, పెరిగిన ధరలు అవసరాలకు అనుగుణంగా పెన్షన్ మొత్తం పెంచాలని కోరారు. మిషన్ వాత్సల్య కింద ..ప్రభుత్వ పిల్లల సంరక్షణ సంస్థలన్నిటిని జిల్లాస్థాయిలో బాల రక్ష భవన్స్ పేరుతో ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చినట్టు తెలిపారు. తద్వారా ఎలాంటి సమన్వయ సమస్యలు లేకుండా పిల్లలకి సంపూర్ణ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో 33 జిల్లాల్లో 39 బాల రక్షక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, అవసరం ఉన్న పిల్లల వద్దకు చేరుకొని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ నుండి శిశు విహార్ ద్వారా ఆరేండ్ల లోపు పిల్లల దత్తత ప్రక్రియను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల కోసం చేపట్టిన చర్యలు, స్పెషల్ హోం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్, స్పెషల్ హోమ్ పిల్లల కోసం 6 వేల చదరపు గజాల్లో నిర్వహిస్తున్న క్రీడా ప్రాంగణాలు, జువెనైల్ పిల్లల కోసం నైపుణ్య శిక్షణ కార్యక్రమాల వివరాలను మంత్రి సీతక్క వివరించారు. మిషన్ శక్తి కింద అత్యాచార, ఫోక్ షో బాధితుల కోసం తెలంగాణలో పోలీసుల సహకారంతో 35 భరోసా సెంటర్లను నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. లైంగిక దాడులు అత్యాచార బాధితులకు గ్రీన్ చాలా ద్వారా పరిహారాన్ని అందిస్తున్నామన్నారు.

తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం దుర్గాబాయి దేశ్ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఏటా 240 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, అందులో 70 శాతం సీట్లను అనాధలకు రిజర్వ్ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ద్విచక్ర, ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ లో మహిళల కోసం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, అందులో ఇప్పటికే 8 మంది ట్రాన్స్ జెండర్ లతో పాటు మొత్తం 950 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. పని ప్రాంతాల్లో జరిగే లైంగిక వేధింపుల కేసులను సత్రం పరిష్కరించేందుకు ఎనిమిది లేబర్ కోర్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్ జెండర్ లను ట్రాఫిక్ కానిస్టేబుల్ గా నియమించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ట్రాన్స్ జెండర్ ల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మైత్రి క్లినిక్ ను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని గుర్తు చేశారు. వికలాంగుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా జాబు పోర్టల్ ను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ చరిత్రలో మొట్టమొదటిసారిగా వికలాంగుల పరికరాల కోసం 50 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇలా తెలంగాణలో మహిళా శిశు సంక్షేమం కోసం అమలవుతున్న ప్రత్యేక పథకాలను మంత్రి సీతక్క వివరించడంతో పాటు, కేంద్ర సౌజన్యంతో అమలయ్యే పథకాల్లో కేంద్రం తన వాటాను పెంచాలని మంత్రి సీతక్క లెక్కలతో సహా వివరించారు.

చివరగా అన్నార్తులు, అనాథలు, ఆకలి బాధ లేని సమాజాన్ని ప్రసాదించాలన్న సంత్ కబీర్ సూక్తితో, దాశరథిపత్యంతో తన ప్రసంగాన్ని మంత్రి సీతక్క ముగించారు. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సీతక్క ప్రసంగం భిన్నంగా సాగటంతో అంతా ప్రశంసించారు. సీతక్క ప్రసంగాన్ని శ్రద్ధగా విన్న ఇతర రాష్ట్రాల మంత్రులు అధికారులు, చప్పట్లతో తమ సంఘీభావం తెలిపారు. మిజోరాం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి లాల్రిన్ పుయా తమ సంప్రదాయ కండువాను సీతక్కకు బహూకరించి అభినందనలు తెలియజేశారు.

# త్వరలో వరంగల్‌కు ఏయిర్‌పోర్ట్ : మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధి : హనుమకొండ జిల్లాలో 3వ ఎడిషన్ క్రేడాయి వరంగల్ ప్రాపర్టీ షోను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రేడాయి ప్రాపర్టీ షో మూడవ ఎడిషన్ వరంగల్ లో విజయవంతంగా నిర్వహిస్తున్న క్రేడాయి ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్ తరువాత వరంగల్, హనుమకొండ, కాజీపేట మూడు సిటీ లు కలిసి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు మంత్రి పొన్నం. ఇటీవలే ఈ ప్రాంతంలో ఆరు వేల కోట్లతో ముఖ్యమంత్రి అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రాపర్టీ షో జరుగుతుంది అంటే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంత వాసులు తాము కోనాలనుకున్న ప్రాపర్టీ ఎక్కడికో వెళ్లకుండా ఇక్కడే మనకి నచ్చింది తీసుకోవచ్చున్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఉత్తర దక్షిణ భారతదేశంలో కలిపే రైల్వే జంక్షన్లు వరంగల్ లో ఉన్నాయని, రాబోయే కాలంలో వరంగల్ నగరానికి ఎయిర్పోర్ట్ రాబోతుందని, వైద్య రంగంలో కాకతీయ మెడికల్ కాలేజి ఎంజీఎం లాంటి ప్రభుత్వ హాస్పిటల్ లు ఉన్నాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. కాకతీయ యూనివర్సిటీ , నిట్ లాంటి విద్యాసంస్థలు ఉన్నాయని, టెంపుల్ టూరిజం లో సమ్మక్క సారలమ్మ ఆలయం , రామప్ప ఆలయం ,వెయ్యి స్థంభాల గుడి ఉన్నాయన్నారు. వరంగల్ హనుమకొండ కాజీపేట లో మరింత అభివృద్ధి చెందడానికి చుట్టూ జాతీయ రహదారులు ఉన్నాయని, క్రేడాయి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానన్నారు. నియోజకవర్గ రెండు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి..నేను జిల్లా మంత్రిగా మీకు అండగా ఉంటానని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ఛైర్పర్సన్ బండా ప్రకాశ్ , ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వరంగల్ మేయర్ గుండు సుధారాణి,కూడా చైర్మన్ ,ఇనగాల వెంకట్ రామిరెడ్డి , క్రేడాయి ప్రతినిధులు పాల్గొన్నారు

## పాడి పరిశ్రమ అభివృద్దే లక్ష్యంగా

# గోకులాల నిర్మాణం

## పాడి, పంటల అభివృద్దే దేశాభివృద్ధి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శనివారం ఆగిరపల్లి మండలము నెక్కలం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2.30 లక్షలతో నిర్మించిన గోకులం చెడ్డను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. గత వైసీపీ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు.

గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. పాడి రైతులు అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 90 శాతం సబ్సిటీ తో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులు సహకరించి తద్వారా పశువుల పెంపకం అభివృద్ధితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ మరియు జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులకు,పశువుల పెంపకం దారులకు నిరుద్యోగులకు ప్రోత్సాహంగా ప్రభుత్వము అనేక రుణాలు అందజేస్తుందన్నారు.

వీటిని ప్రతీ ఒక్క పశువుల పెంపకం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.సన్న ,చిన్నకారు రైతులు రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అంది వుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సన్న, చిన్న, కారు రైతులకు ప్రోత్సాహకరమైన ఋణాలు అందుబాటులో ఉన్నాయి అని వాటిపై అవగహన పెంచుకొని ఋణాలను పొందాలని తద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు పిలుపునిచ్చారు.రైతులకు, ఋణాలపై అవగహన మరియు వాటి లబ్ధిపై, వాటిని పొందే విధానంపై బ్యాంకర్స్, మరియు, అగ్రికల్చర్, ఇతర ప్రభుత్వ అధికారులు కలిసి ప్రతీ నెల ఒక మీటింగ్ ఏర్పాటు చేసి రైతులకు,ముఖ్యంగా పశువుల పెంపకం దారులకు ఋణాలను అందించే భాద్యత మీ పై ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. అలాగే ఆధునిక ప్రపంచంలో వ్యాపారంలో పోటీ పడాలంటే ఆధునిక టెక్నాలజీ జోడించి వ్యాపారం చేస్తే ఆర్థిక ఫలాలు లాభాలు అంది వుచ్చుకోవచ్చని మంత్రి సూచించారు. గొర్రెలు, మేకలు,పశువుల, మూగ జీవుల ఫామ్స్ నిర్మాణానికి కోటి రూపాయలు వరకు ఋణం 50 శాతం సబ్సిటీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు.దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడి ఋణాలను విస్తృతంగా గ్రామ స్థాయిలో ప్రసారం చేయవలసిన బాధ్యత బ్యాంకర్స్, మరియు ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు.ఏ ఒక్క రైతులకు బ్యాంకర్స్ ఋణాలు ఇవ్వమని చెప్పిన పక్షంలో నా దృష్టికి తీసుకొస్తే తక్షణమే బ్యాంకర్స్ తో మాట్లాడి ఋణాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.

## జిల్లాలో 680 మినీ గోకులం నిర్మాణాకి గాను ఇప్పటి వరకు

# 304 షేడ్స్ నిర్మాణం పూర్తి చేశాం

- రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది
- మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిబద్ధతతో వారి మేలుకోరి పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.శనివారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో రు. 1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులాన్ని మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సాంప్రదాయ పద్ధతిలో గోమాతకు పూజలు నిర్వహించి, పొలంలో వరి నాట్లను స్వయంగా నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఎడ్ల బండి పై గ్రామంలోకి విచ్చేసి సంక్రాంతి వేడుకల్లో భాగస్వామ్యం అయ్యారు. మహిళలు చిన్నారులు వేసిన ముగ్గులను, సాంప్రదాయ పద్ధతిలో హరినామం చేస్తున్న హరిదాసు సంకీర్తన ను ఆసక్తిగా తిలకించి, భోగి మంటలను వెలిగించి ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 12500 మినీ గోకులాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో పశు సంపద అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. అదే క్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో 680 మినీ గోకులం నిర్మాణం కోసం రూ.15 కోట్ల 59 లక్షలతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.6 కోట్ల 18 లక్షల వ్యయంతో 304 షేడ్స్ నిర్మాణం పూర్తి చేసామన్నారు. రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 12,500 గోకులాలను ఒకే రోజు ప్రారంభించే కార్యక్రమాన్ని నిన్నటి రోజున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా ప్రారంభించారని పేర్కొన్నారు.. పాడి రైతులకు ఎంతో అవసరం అయ్యే గోకులాలను గత అయిదేళ్ల పాలనలో కేవలం 268 నిర్మిస్తే, ఎన్డీయే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే 12,500 నిర్మించి పాడి రైతులకు అండగా నిలిచిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గం లో 128 గోకులాలు మంజూరు కాగా ఇప్పటివరకు రు. 1కోటి 13 లక్షల రూపాయలతో 54 గోకులాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు సొమ్ము 1600 కోట్ల బకాయిని, కూటమి ప్రభుత్వం చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. ప్రతి రైతుకు ఆర్థిక సహాయంగా కేంద్ర నుంచి రు. 10 వేలు, రాష్ట్రం నుంచి రు. 10 వేలు చొప్పున మొత్తం రు. 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని త్వరలో అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

నిడదవోలు నియోజకవర్గం లో రైతులకు ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన వెయ్యి రూపాయలతో రు. ప్రతి నెల క్రమం తప్పకుండా రు. 4 వేల రూపాయలను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులకు రు. 3 వేల నుంచి రు. 15 వేల వరకు అందజేస్తున్నమన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.. గ్రామీణ రహదారులకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత్రిస్తూ జిల్లా వ్యాప్తంగా 134 కి.మీ. మేర 660 సిసి రోడ్లు నిర్మాణం పనులను రూ.65 కోట్ల 62 లక్షల చేపట్టడం జరిగిందన్నారు. వాటిలో ఇప్పటి వరకు 75 కి.మీ. మేర 424 సిసి రోడ్లు నిర్మాణం పనులను రూ.43 కోట్ల 68 లక్షల వ్యయంతో పూర్తి చెయ్యడం జరిగిందని మంత్రి తెలిపారు.

గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మన సంప్రదాయ పండుగలను భవిష్యత్తు తరాలకు అందించటానికి చొరవ చూపాలని, ఇటువంటి వేడుకల్ని నిర్వహించి నందుకు నిర్వాహకులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న, అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో రు. రు.15.59 కోట్ల రూపాయలతో 680 గోకులాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి వేళ పొలంలో వరి నాట్లు వేసి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు జిల్లా ప్రజలకి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు మద్దంశెట్టి వరలక్ష్మి, తిర్నాతి నాగమణి, దొడ్డిపట్ల భవాని, దేవరపల్లి హేమ సుందరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డ్వామా పి డి ఎ. నాగ మహేశ్వర రావు, గ్రామ సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

- ఈలోగా ఇచ్చిన హామీలను అమలు చేస్తాం
- కేసీఆర్ ప్రభుత్వ దోపిడీపై చర్యలు తీసుకుంటాం
- మంత్రి ఉత్తమ్ షాకింగ్ కామెంట్స్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడ్డారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ వ్యవస్థ రాబోతోందన్నారు. వీఆర్వో లు వీఆర్ఏలు రాష్ట్రంలో సుమారు 23 వేలమంది ఉన్నారని చెప్పారు. వాళ్లలో 16300 మంది రెవెన్యూశాఖలోకి రావటానికి దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ప్రెస్ అకాడమీతో చర్చించి త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు ఇస్తామని ప్రకటించారు. తన గెలువులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు. త్వరలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేద కుటుంబాన్ని ఒక యూనిట్గా ఎంపిక చేస్తున్నామని అన్నారు. ఆ కుటుంబం తప్పని సరిగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉండాలని.. అంతకుమించి నిబంధనలు ఏమీ ఉండవని చెప్పారు. భూ భారతి విషయంలో చాలా పకడ్బందీగా చర్యలు ఉంటాయని అన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా భూ భారతి చట్టం రూపుదిద్దుకుంటుదన్నారు. భూ భారతిని గవర్నర్ కూడా ఆమోదించారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఇష్టారీతిన ధరణి అమలు చేసిందని.. కనీస నిబంధనలు కూడా లేకుండా ధరణి అమలు చేశారని తెలిపారు. ఫిబ్రవరి 15 లోగా భూ భారతి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఏపీ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో వచ్చిన ఫిర్యాదులు ఆరోపణలపై శాఖా పరమైన విచారణ జరుగుతోందని చెప్పారు. 2025 భూ భారతి చట్టంలో ల్యాండ్ అప్పీలు అధారిటీని ప్రత్యేకంగా అమలు జరువుతున్నామని చెప్పారు. సమగ్ర సర్వేపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 59 జీఓ ద్వారా కోట్లాది రూపాయల విలువైన భూములు పిక్ షర్టుకు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 59 జీఓ పేరుతో జరిగిన దోపిడీని అడ్డుకుంటామని చెప్పారు. ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## పంచాయతీరాజ్ సంస్థలలో

# బీసీ రిజర్వేషన్లను పెంచాలి

- 20 నుంచి 42 శాతం కు పెంచాలని లేకపోతే ఉద్యమం ఉధృతం
- బీసీ సంక్షేమ సంఘం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య



తెలంగాణ బ్యూరోప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరువుతామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుంది. కులగణన చేసిన తర్వాత దాని ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలి. కులగణన చేసిన తరువాత రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన చట్ట పరమైన అవరోదలు యుండవన్నారు. గతంలో 1986లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ప్రస్తుత ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బి.సి సంక్షేమ సంఘం అనేక ఉద్యమాలు చేయగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామ రావు స్పందించి బి.సి.లకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాల్ ఎన్నికలలో 20శాతం రిజర్వేషన్లు పెట్టారు.

సర్పంచ్ లకు పెట్టలేదు. బి.సి రిజర్వేషన్లు 50శాతంకు పెంచాలని, సర్పంచ్ ఎన్నికలలో కూడా బి.సి రిజర్వేషన్లు పెట్టాలని బి.సి సంక్షేమ సంఘం 6 సంవత్సరాలు వరుసగా సుదీర్ఘంగా ఉద్యమాలు చేయగా 1993లో అప్పటి ముఖ్యమంత్రి విజయభాస్కర్ రెడ్డి స్పందించి ఒక మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి బి.సి సంఘాలతో చర్చించి 20 శాతం నుంచి 34 శాతం పెంచుతూ రిజర్వేషన్లు పెట్టారు.

అప్పటి నుంచి 2019 వరకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగాయి. సుప్రీంకోర్టు తర్వాత తీర్పు ప్రకారం 2019లో స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22శాతంకు తగ్గించారు. దీనితో బీసీలకు అన్యాయం జరిగింది. అప్పటి నుంచి జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ పార్లమెంట్ వద్ద ధర్నాలు జరిపి అన్ని పార్టీల మీద ఒత్తిడి తేవడంతో కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని అన్నీ పార్టీలు హామీ ఇచ్చారు. అందులో భాగమే పెంచుతామన్న కాంగ్రెస్ పార్టీ జనాభా ప్రకారం పెంచుతామని హామీ ఇచ్చారు. అందుకోసం రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్లను చట్టబద్దం చేయాలని అనంతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 27న తెలంగాణకు ఖర్గే, రాహుల్

### సంవిధాన్ బచావో ప్రదర్శనలో పాల్గొననున్న ఏఐసీసీ నేతలు

తెలంగాణ బ్యూరోప్రతినిధి : కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న సంవిధాన్ బచావో ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్రను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ పిలువునిచ్చారు. మహేశ్కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలువునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. సంవిధాన్ బచావో ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు.

## విజయవాడ బుక్ ఫెయిర్‌లో పుస్తకాలు కొనుగోలు

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి పుస్తకాలంటే అమితమైన ప్రేమ. పుస్తక ప్రియులైన పవన్ కళ్యాణ్ విజయవాడ బుక్ ఫెయిర్ ను శనివారం ఉదయం సందర్శించారు. దాదాపు రెండున్నర గంటలపాటు పలు పుస్తక కేంద్రాలకు వెళ్ళి పుస్తకాలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్ లో పుస్తకాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు కొనుగోలు చేశారు. తెలుగు సాహిత్యానికి సంబంధించి పలు పుస్తకాలు పరిశీలించారు. ప్రముఖ రచయితల నుంచి యువ రచయితల వరకూ పలువురి రచనలను కొనుగోలు చేశారు. అదే విధంగా ప్రాచీన సాహిత్యంపై వెలువరించిన విశ్లేషణలు, పరిశీలన పుస్తకాలను ఎంచుకున్నారు. వీటితో అనువాద సాహిత్య పుస్తకాలు, నిఘంటువులు, ఆధ్యాత్మిక సంబంధిత రచనలు పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా తనకు ఎంతో నచ్చిన మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్ పుస్తకం చూసి ఎంతో సంతోషించారు. డా.విక్టర్ ఈ.ఫ్రాంకిల్ రాసిన ఈ పుస్తకం చదివితే నిరాశానిస్పృహలు అధిగమించి ఆశావాద భావన కలుగుతుందని చెప్పారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల నిర్బంధాల్లో ఉన్న ఫ్రాంకిల్ ఎలా భవిష్యత్ జీవితాన్ని నిలువుకున్నాడో ఆ రచన తెలువుతుందని చెబుతూ బహుమతిగా ఇవ్వడానికి ఉంటాయని ఎక్కువ సంఖ్యలో ఈ పుస్తకాలు కొనుగోలు చేశారు. అదే విధంగా భారతీయ చట్టాలు, చరిత్ర, రాజకీయ, పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష, పర్యావరణ సంబంధిత పుస్తకాలపై ప్రత్యేక ఆసక్తి చూపారు. ఉప ముఖ్యమంత్రివర్యుల వెంట విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు, బుక్ ఫెయిర్ నిర్వాహకులు ఎమెస్కో విజయ్ కుమార్,టి.మనోహరనాయుడు, లక్ష్మయ్య, బాబ్జీ తదితరులు ఉన్నారు.

## పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను అధ్యయనం చేసిన

# జలశక్తి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

- స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ నేతృత్వంలో పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సంబదర్శించిన కమిటీ
- ప్రాజెక్ట్ ప్రయోజనాలు, పనుల పురోగతిని వివరించిన జలవనరుల శాఖ అధికారులు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను అధ్యయనం చేసేందుకు శనివారం పోలవరం విచ్చేసిన కేంద్ర జలశక్తి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందుగా ప్రాజెక్ట్ లోని స్పిల్ వే ని పరిశీలించింది. అనంతరం ఎగువ, దిగువ కాఫర్ డాం పనులను పరిశీలించింది. అనంతరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించింది. అనంతరం డయాఫ్రమ్ వాల్ పనులను పరిశీలించి జనవనరుల శాఖ అధికారులను, ప్రాజెక్ట్ ఇంజినీర్ల ను కమిటీ చైర్మన్, సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రదేశాలలో కాంట్రాక్టు ఏజెన్సీ, ప్రాజెక్ట్ ఇంజినీర్లు ప్రాజెక్ట్ పనుల ప్రగతిపై ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శనలను కమిటీ సభ్యులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిటీ కి ఆయా ప్రాంతాలలో ప్రాజెక్ట్ పనులకు సంబందించిన వివరాలను జలవనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ వివరించారు. అంతకుముందు కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ కమిటీ సభ్యులతో కలిసి ప్రాజెక్ట్ సమావేశపు హాలులో పోలవరం ప్రాజెక్ట్ పనులకు పురోగతిపై కాంట్రాక్టు ఏజెన్సీ, ప్రాజెక్ట్ ఇంజినీర్లు, అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రయోజనాలు, పనుల పురోగతిని జలవనరుల శాఖ అధికారులు వివరించారు. అదేవిధంగా కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలకు జలవనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. దీనిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి లో నిర్మిస్తున్న గృహనిర్మాణ వివరాలను అధికారులను కమిటీ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు రాజ్యసభ సభ్యులు ఖిరు మహ్తో, శ్రీమతి ధర్మశీల గుప్తా, లోక్ సభ సభ్యులు రీ షేర్ సింగ్ ఘుబాయా, రోడ్మల్ నగర్, జోయంత బసుమతరీ, నారాయణ్ దాస్ అహిర్వార్, శ్రీమతి సంజ్ఞ జాతవ్, సాగర్ ఈశ్వర్ ఖండ్రే, విశాల్ (దాదా) ప్రకాష్బాపు పాటిల్, మోహితే–పాటిల్ ధైర్యశీల్ రాజ్సిన్హ్ లు ఉన్నారు.కమిటీ వెంట ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఆర్ అండ్ ఆర్ కమీషనర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు నరసింహ మూర్తి, బి. రాంబాబు లు , పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ మెంబెర్ సెక్రటరీ ఎం. రఘురాం, ఏ పి జెన్కో ఎండి కె.వి. ఎన్ . చంద్రశేఖర్, కేంద్ర జల సంఘం మెంబెర్ గోపాల్ సింగ్, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఎండి సిహెచ్.వి. సుబ్బయ్య, జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఎం. వెంకటేశ్వర రావు, ఆర్డీఓ ఎం.వి. రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఎందుకీ రహస్యం

- మేఘా సంస్థను బ్లాక్లిస్టో పెట్టాలనే కమిటీ రిపోర్ట్ ఎక్కడ
- సుంకిశాల ఘటన.. తప్పును ఒప్పుకున్నట్టేనా?
- సంస్థ నిర్లక్ష్యం వల్ల రిటైనింగ్ వాల్ కూలి రూ. 80 కోట్ల ప్రజాధనానికి నష్టం
- మేఘా కృష్ణారెడ్డికి మధ్య కుదిరిన చీకటి ఒప్పందమే
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: సుంకిశాల ఘటనపై విజిలెన్స్ నివేదికను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వకుండా తొక్కిపెట్టడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్వేదికగా ఆయన స్పందిస్తూ.. ఒక నిర్మాణ సంస్థ చేసిన ఘోర తప్పిదాన్ని.. దేశ రక్షణకు సంబంధించిన సమాచార హక్కు సెక్షన్లతో ముడిపెట్టి దాచడం మరింత విడ్డూరమన్నారు. మేఘా సంస్థను బ్లాక్లిస్టో పెట్టాలనే కమిటీ రిపోర్ట్ను ప్రభుత్వం రహస్యంగా ఉంచడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్ – మేఘా కృష్ణారెడ్డికి మధ్య కుదిరిన చీకటి ఒప్పందమే అని ఆరోపించారు. సుంకిశాలలో మేఘా సంస్థ నిర్లక్ష్యం వల్ల రిటైనింగ్ వాల్ కూలి రూ. 80 కోట్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లిందన్నారు. హైదరాబాద్లో పెరుగుతున్న తాగునీటి అవసరాలు తీర్చే సంకల్పానికి గండిపడిందన్నారు. నిర్మాణ లోపం బయట పడుతుందనే భయంతోనే కమిటీ నివేదికను బహిర్గతం చేయడానికి కాంగ్రెస్ సర్కారు జంకుతోందన్నారు. సమాచారాన్ని దాచడం అంటే జరిగిన తప్పును ఒప్పుకున్నట్టే అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని దుమ్మెత్తిపోసిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. తన జేబు సంస్థగా మార్చుకుని ఢిల్లీ పెద్దల ధనదాహాన్ని తీర్చేందుకు పావుగా వాడుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు.బ్లాక్లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి రూ.4,350 కోట్ల కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేక్ కోసినట్టు చెరిసగం పంచిపెట్టి భారీ కుంభకోణానికి తెరతీశారని ఆరోపించారు. ఇప్పటికైనా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను మానుకోవాలని, సుంకిశాల ఘటనపై ప్రభుత్వం చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. కాగా.. నల్లగొండ జిల్లా సుంకిశాల వద్ద చేపట్టిన జలమండలి పనుల్లో ఒక్కసారిగా రిటెయినింగ్ వాల్ కుప్పకూలిన విషయం తెలిసిందే. నాగార్జున సాగర్ జలాశయానికి ఆనుకుని నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు టన్నెల్ గేటు, ఇన్టేక్ వెల్ రక్షణ గోడ గతేడాది కుప్పకూలింది. భారీ శబ్దంతో రిటెయినింగ్ వాల్ కూలింది. అయితే ఆ సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఇంజనీర్ల కమిటీతో విచారణ జరిపిన వాటర్ బోర్డు.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సుంకిశాల ప్రాజెక్టు సైడ్ వాల్ (రక్షణ గోడ) కూలిపోయిన ప్రమాద ఘటనకు పూర్తి బాధ్యత తమదేనని నిర్మాణ సంస్థ వాటర్ బోర్డుకు తెలిపింది. దీనికి నిర్మాణ సంస్థ మూడు పేజీలతో కూడిన వివరణ లేఖను వాటర్ బోర్డుకు అందజేసింది. అయితే ఘటనకు కారణమైన మేఘా ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలు తీసుకోకుండా కాపాడుకుంటూ వస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. మేఘా సంస్థను బ్లాక్లిస్టో పెట్టాలనే కమిటీ రిపోర్ట్ను ప్రభుత్వం రహస్యంగా ఉంచింది.





## కనుమరుగవుతున్న

# మన సంప్రదాయం

### పాశ్చాత్య ధోరణులతో మరిచి పోతున్న మన సంస్కృతి గంగిరెద్దులు, హరిదాసులు అంటే... అనే పరిస్థితి

**రంగురంగుల హరివిల్లులతో తీర్చిదిద్దిన లోగిళ్లు, పసుపు కుంకుమలు వేసిన గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పిండి వంటల ఘుమఘుమలు, ఎటు చూసినా పతంగులు, కొత్త అల్లుళ్లు.. సంక్రాంతి వచ్చిందంటే ఆ సందడే వేరు. కానీ పాశ్చాత్య ధోరణి వెంట పాకులాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతున్నాం. నేటి తరం.. గంగిరెద్దులు, హరిదాసులు అంటే.. అవేమిటీ? అనే అడిగే పరిస్థితికి మనమొచ్చాం.. ఒక్కసారి మనమేం మర్చిపోతున్నామో గుర్తుచేసుకుందాం..**

## హరిదాసులు

హరిదాసులు నెత్తిమీద పాత్ర పెట్టుకుని హరి నామ స్మరణ చేస్తుంటారు. హరిదాసులు పెట్టుకునే పాత్ర కూడా భూమికి సంకేతంలా ఉండే గుండ్రని ఆకారంలోనే ఉంటుంది. అందులో బియ్యం వేయడమంటే..ధాన్యలక్ష్మిని మనం గౌరవించడమే. హరిదాసు విష్ణు సంకీర్తనం చేస్తుంటారు. విష్ణువు ఉన్న చోటకి ధాన్యలక్ష్మి చేరుతుంటుంది. లక్ష్మీని విష్ణువు దగ్గరకు చేర్చడానికి హరిదాసు మనకు అవకాశం ఇస్తున్నట్టుగా భావించాలి. భూమి లాంటి పాత్రలో బియ్యం వేస్తున్నామంటే..భూమి సస్యశ్యామలం అవ్వాలని మనం కోరుకుంటునట్టు అర్థం."శ్రీరమా రమణ గోవిందోహరి! శ్రీజానకీ రమణ గోవిందోహరి!" అంటూ హరినామ సంకీర్తన చేస్తూ ఇంటింటికి తిరుగుతూ భిక్ష వేసిన గృహస్థులను రామార్పణం, కృష్ణార్పణం, భగవతార్పణం అంటూ దీవిస్తుం టారు హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం నుంచి మకరసంక్రమణ రోజు వరకు వైష్ణవ భక్తి గీతాలను ఆలపిస్తూ పల్లెలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లే ఈ హరిదాసులనే మాలదాసులు, మాలదాసర్లు అని పిలుస్తారు.

**నెల రోజులు నిష్ఠతో..**

హరిదాసులు ధనుర్మాస ప్రారంభం నుంచి మకర సంక్రమణ వరకు వేకువజామునే లేచి తలంటుస్నానం చేస్తారు. నొసట తిరుమణి, తిరు చూర్ణం, పట్టెనామాలు ధరించి కొత్త బట్టలు ధరిస్తారు. తెల్లపంచె/ కాషాయ పంచె, చొక్కా అంగి, నడుముకు గుడ్డ, కాలికి అందెలు కట్టుకుని.. మెడలో పూలదండ, తలపై కలశం (అక్షయపాత్ర), కుడిభుజంపై తంబుర, ఎడవ ంచేతిలో చిటికెలు ధరించి హరినామ సంకీర్తన చేస్తూ ఇంటింటికీ తిరుగుతారు. మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు అలా తిరిగి ఇంటికి వచ్చేస్తారు. స్నానం చేసి పూజా కార్యక్రమాలు ముగించాకే ఆహారం తీసుకుంటారు. ఈ నెల రోజులు వీళ్లు చాలా నిష్ఠగా ఉంటారు. నేలపడక, ఒంటిపూట భోజనం చేస్తారు. తర్వాత రోజుల్లో వీళ్లు వీధి నాటకాలను ప్రదర్శిస్తారు. కొందరు బుర్రకథలు గానం చేస్తారు. ఈ మూడు ఆచా రాలూ వీళ్లకి వంశపారంపర్యంగా వస్తున్నాయి.

**ధనుర్మాసంలో వైష్ణవ గీతాలను గానం :** మాలదాసులుగా, హరిదాసులుగా వ్యవహారంలో ఉన్న వీళ్లు మాలల్లో ఒక తెగవారు. మాలలకు వివాహాది శుభకార్యాలు, అపరకర్మలు నిర్వ హిస్తూ భజన కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. వీళ్లు వివాహ వ్యవస్థలో మేనరికానికి ప్రాధాన్య మిస్తారు. మేనరికం లేనప్పుడు బయట వధువును వెతుకుతారు. ప్రాచీన కాలం నుంచి వస్తున్న 'ఓలి' సంప్రదాయం వీళ్లలోనూ ఉంది. ఇది కన్యాశుల్కం లాంటిది. మాలదా సులు అపరకర్మ కాండలను రాత్రుల్లోనే నిర్వహిస్తారు. రామానుజకూటంలోని అందరూ ఇలాగే చేస్తారు. చనిపోయిన వారిని శ్మశానం వరకూ చేతుల మీదనే తీసుకెళ్లి ఖననం చేస్తారు. పాడెలాం టిది కట్టరు. కార్తీకమాసంలో వచ్చే శుద్ధ ద్వాదశిని వీరు 'మంగళ కైశికి ద్వాదశి'గా వ్యవహరిస్తారు. ఉత్సవాలు నిర్వహిస్తారు. ధనుర్మాసంలో వైష్ణవ గీతాలను గానం చేస్తారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో వీళ్ల జీవనోపాధి ఒడుదొడుకులకు లోనవుతోంది. వీరి ప్రదర్శనా కళలకు కూడా ఆదరణ లేకపోవడంతో ఈ హరిదాసులకు జీవనభృతి కష్టంగా ఉంది. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో చాలామంది ఈ వృత్తిని మానేస్తున్నారు. హరిదా సుల కు తమ వృత్తిపై నమ్మకం కలిగించాల్సింది.. వారినీ, వారి ప్రదర్శన కళలనూ అక్కున చేర్చు కో వాల్సిందీ, హరిదాసుల సంప్రదా యాన్ని కొనసాగించుటకు ఊతమివ్వాల్సింది మనమే.

*తెలుగు రాష్ట్రాలలో ప్రజలందరికి సంక్రాంతి పండుగ చాలా పెద్ద పండుగ. ధనుర్మాసంలో వచ్చే ఈ సంక్రాంతి పండుగను ప్రజలందరూ మూడు రోజులపాటు ఘనంగా జరుపుకుంటారు. ఇంటిల్లిపాది ఎంతో ఆనందంగా ఇంటిముందు రంగురంగుల ముగ్గులు వేసి ఇంటిని రంగురంగుల పువ్వులతో అలంకరించి రకరకాల పిండి వంటలు, హరిదాసు గీతాలు, గాలిపటాలు, గంగిరెద్దుల కోలాహలం ఈ సంక్రాంతి పండుగకు చాలా ప్రత్యేకమైనవి. సంక్రాంతి పండుగ జరుపుకునే మూడు రోజులపాటు మొదటి రోజు భోగి పండుగ. ఈ భోగి పండుగ రోజున భోగిమంటలు వేయటం ప్రత్యేకత. ఇక మకర సంక్రాంతి రోజున గాలిపటాలు ఎగరవేయటం, హరిదాసు గీతాలు, కోళ్ల పందాలు, గంగిరెద్దుల కోలాహలం ప్రత్యేకమైనవి. సంక్రాంతి మాసంలో హరిదాసులు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు గతంలో కనిపించేవి. పల్లెల్లో ఇప్పటికి ఈ ఆచారం నామా మాత్రంగానే కనిపిస్తోంది. అదే నగరాల్లో వీటిని చూడటం కూడా గగనమే.*



సంక్రాంతి పండుగ రోజున ఇలా గంగిరెద్దులు ప్రత్యేకతల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం

**పశు సంస్కృతికి కృతజ్ఞతాపూర్వకంగా**

కేవలం ఆవుని పూజించడం మాత్రమే కాక గోవుల సంక్షేమాన్ని, పశుజాతి సంక్షేమాన్ని కోరుకునేలా ప్రకృతికి విరుద్ధంగా పశుజాతి అంతరింప చేయాలన్న ఆలోచన రానీయకుండా చేయడానికి ఈపద్ధతి పెట్టారు. గంగిరెద్దు ముందు వెనకాల ఎత్తైన మూపరం ఉంటుంది. అది శివలింగం ఆకృతిని గుర్తు చేస్తూ శివునితో సహా తాను సంక్రాంతి సంబరాలకు హాజరు అయ్యానని చెప్పేందుకు సంకేతంగానే గంగిరెద్దుఇంటి ముందుకు వస్తుందని అంటారు. మనిషులు పశు వుల ద్వారా చాలా ప్రయోజనాల పొందుతుంటారు. అందుకే కృతజ్ఞతాపూర్వకంగానే ఆ గంగిరెద్దులను అందంగా అలంకరించడం ఒక సంప్రదాయంగా పెట్టారు.




**ఆకట్టుకొనే అలంకరణ**

గంగిరెద్దుల అలంకరణ ఆకట్టుకునేలా ఉంటుంది. ఉన్నంతలో అందంగా తీర్చిదిద్దుతారు. బట్టలను బొంతలుగా కుట్టి, వాటికి అద్దాలు పొదుగుతారు. మరింత ఆకర్షణ కోసం చెమ్కీ దండలు జతచేసి, మూపురం నుంచి తోక వరకూ కప్పుతారు. ముఖం దగ్గర రంగుల తోలు కుచ్చు, మూతికి తోలుతో కుట్టిన శిఖమారు కడుతారు. కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు కట్టి బసవన్నను అలంకరిస్తారు. వాటిని ఆడించే కళాకారులూ ప్రత్యేకంగా ముస్తాబవుతారు. నెత్తికి రంగుల తలగుడ్డ, మూతిమీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, పాత కోటు, చేతికి వెండి మురుగులు, పంచె ధరించి ఆకర్షణీయంగా కనిపిస్తా రు. సన్నాయి బూర, డోలు, చేతిలో చిన్న కంచు గంట పట్టుకొని ప్రదర్శన నిర్వహిస్తారు. ఆటతోపాటు గాత్రంతోనూ వినోదాన్ని పంచుతారు. సన్యాసమ్మ, రామ- ంలోరు, గంగరాజు, ఈశ్వరమ్మ, వీరగున్నమ్మ పాటల్లాంటివి పాడతారు.

**ఆడిస్తూ.. ఆశీర్వదిస్తూ..**

సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గంగిరె ద్దులను ఆడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటి వాళ్లు హారతి పట్టి పూజిస్తారు. "డూ..డూ బసవన్న.. రారా బసవన్నా..' అనగానే ఎద్దులు ముందుకు వస్తాయి. "అమ్మ వారికి దండం పెట్టూ..అయ్యగారికి దండం పెట్టు ' అనగానే ముందరి కాలెత్తి సలాం చేస్తాయి. "అయ్యగారికి శుభం కలుగుతుందా..? తలపెట్టబోయే కార్యం సఫలమవు తుందా..?' అనగానే గంగిరెద్దులు తలాడించడాన్ని శుభ సూచికంగా, నందీశ్వరుడి దీవెనగా భావిస్తారు. గంగిరెద్దువాళ్లు కూడా ఎద్దు ముందు కాళ్లను ఛాతీమీద పెట్టుకొని ఆడిస్తారు. ఇంటిల్లిపాదినీ తమదైన శైలిలో పొగుడు తూ..ఆశీర్వచనాలు ఇస్తారు.

**ప్రదర్శన విధానమిది..**

ఒక బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఉంటారు. ప్రధాన వ్యక్తి గంగిరెద్దును ఆడిస్తుంటే, మిగతా వారు డోలు, సన్నాయి వాయిస్తుంటారు. మేళతాళాలకు అనుగుణంగా గంగిరెద్దును ఆడిస్తుంటారు. వీరంతా ఒక్కో గ్రామంలో మకాం వేస్తూ, గ్రామ పెద్దల అనుమతితో ఊరి మధ్యలోగానీ, చౌరస్తా లాంటి ప్రదేశంలోగానీ గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రదర్శన అనంతరం గ్రామ ప్రజలు ఇచ్చే పారితోషికం తీసుకొంటారు.

**కనుమరుగవుతున్న సంస్కృతి**

'డూ..డూ బసవన్నా ఇటు రారా బసవన్నా.. అమ్మవారికి దండం బెట్టు..అయ్యగారికి దండం పెట్టు.. మన సుబ్బు గారికి దండం పెట్టూ రారా బసవన్నా.. రారా బసవన్నా.. అం టూ..' సాగే గంగిరెద్దులు వారి ఆటా.. పాటా నెమ్మదిగా కనుమరుగవుతోంది. తమ అద్భుత సంస్కృతిక కళానైపుణ్యంతో గ్రామీణులను రంజింపచేస్తూ ప్రతిఫలంగా వారిచ్చేది స్వీకరిస్తూ జీవనం కొనసాగించే గంగిరెద్దుల వారి బతుకులు ఆగమవు తున్నాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని గంగిరెద్దుల కులస్థులు కోరుతున్నారు.

– జూలూరి భార్గవి సరస్వతి

8790496969

## సంక్రాంతి గంగిరెద్దు వెనక కథ ఇదీ

ఈశ్వరునికి కృత్తివాసుడు అన్న పేరు ఉంది. అంటే చర్మధారి అని అర్థం. ఆ చర్మం కూడా ఏనుగురూపంలో ఉండే గజాసురుడు అనే ఓ రాక్షసుని చర్మం. ఇంతకీ దానినే శివుడు ఎందుకు ధరిస్తాడంటే... పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. బ్రహ్మ అనుగ్ర హించిన వరంతో ముల్లోకాలనూ జయించిన వీరుడు గజాసురుడు. అతను పరమ శివభక్తు డు. శివారాధన లేనిదే అతని రోజు సంపూర్ణం అయ్యేది కాదు. నిత్యం శివారాధన చేసినా, గజాసు- రునికి ఏదో లోటుగానే ఉండేది. ఎంతైనా రాక్షసుడు కదా! శివుని ఆరాధించడం ఏంటి. ఆయనను తనలోనే నిలుపుకోవాలన్న ఆశ అతనిలో పుట్టింది. అంతే! వెంటనే శివుని గురించి ఘోరమైన తపస్సుని ఆచరించడం మొదలుపెట్టాడు. భక్తవత్సలుడైన శివుడు ప్రత్యక్షం కాగానే 'నిన్ను వీడి వేరుగా ఉండలేకపోతున్నాను. ఈ భక్తుని కరుణించి ఇకనుంచి నా శరీరంలోనే ఉ ండిపో'మ్మని కోరుకున్నాడు శివుడు. భోళాశంకరుడైన శివుడు అలాగే గజాసురుని గర్భంలో కొలువుండిపోయాడు.

శివుడు లేని ముల్లోకాలూ అల్లకల్లోలం అయిపోయాయి. ఆయన గురించి వెతికిన ప్రమథగణాలు వెతికివెతికి అలసిపోయాయి. చివరికి పరమేశ్వరుడు ఎక్కడ ఉన్నాడో పార్వతీదేవికి తెలియవచ్చింది. కానీ ఇప్పుడేం చేసేది! అతను చూస్తేనేమో బలపరాక్రమవం తుడైన రాక్షసుడు. పైగా శివుని తన దేహంలోనే ఉంచుకున్న అతనిని జయించడం అసాధ్యం. ఇక ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో పార్వతీదేవి విష్ణుమూర్తిని ఆశ్రయించింది. విషయాన్ని విన్న విష్ణుమూర్తి, బ్రహ్మాది దేవతలతో కలిసి ఒక ఉపాయాన్ని ఆలోచించాడు.

ఆ ప్రకారం నందిని గంగిరెద్దులా అలంకరించారు. దేవతలందరూ మారువేషాలలో తలా ఓ వాయిద్యాన్నీ పట్టుకుని, గంగిరెద్దుని ఆడిస్తూ గజాసురుని విడిదిని చేరుకున్నారు. తన ముందు అత్యద్భుతంగా నృత్యగానాలతో సాగిన విష్ణువిలాసాన్ని చూసిన గజాసురుడు చలించి పోయాడు. 'మీ అద్భుతమైన ప్రదర్శనకు బదులుగా ఏం కావాలో కోరుకోమన్నా'డు. 'గజా సురా! ఈ గంగిరెద్దు సామాన్యమైనది కాదు. ఇది సాక్షాత్తూ ఆ పరమేశ్వరుని వాహనమైన నంది. తన స్వామికి దూరమై చాలా బాధలో ఉంది. దానిని తన స్వామి దగ్గరకు చేరు కోనియ్యి' అని అడిగాడు విష్ణుమూర్తి.

విష్ణుమూర్తి కోరికను విన్న గజాసురునికి విషయం అర్థమైంది. వీరంతా తనలో ఉన్న పరమేశ్వరుని తిరిగి తీసుకువెళ్లడానికే వచ్చారని బోధపడింది. శివుడు కనుక తన శరీరాన్ని చీల్చుకుని బయటకి వస్తే తన మృత్యువు తప్పదు. 'పరమేశ్వరా! నాకు చావు దగ్గరపడిందని తెలిసిపోయింది. కానీ నిన్ను వదిలి ఉండటానికి మనస్కరించడం లేదు. అందుకని ఇకపై నా చర్మాన్ని నువ్వు ధరించు. నా శిరసును ముల్లోకాలూ పూజించేలా అనుగ్రహించు' అని వేడుకున్నాడు. శివుడు 'తథాస్తు' అనగానే నంది తన పొట్టిన చీల్చి, అందులోని శివుడు బయటకు వచ్చేందుకు అనుమతించాడు గజాసురుడు. తరువాతి కాలంలో శివుని చేతిలో సంహరింపబడిన వినాయకునికి గజాసురుని శిరసుని జోడించడంతో, అది ముల్లోకాలకూ పూజనీయంగా మారింది.

ఇక గజాసురుని చర్మాన్ని శివుడు స్వయంగా ధరించసాగాడు. లోకకళ్యాణం కోసం తన భక్తులను శిక్షించినా, వారికి కైవల్యాన్నే ప్రసాదిస్తానని పరమేశ్వరుడు ఈ సందర్భంలో చెప్పకనే చెబుతున్నాడు. శివుని చేజిక్కించుకోవడం కోసం విష్ణుమూర్తి ఆడిన నాటకమే గంగిరెద్దుల సంప్రదాయానికి నాంది పలికిందని చెబుతారు. సంక్రాంతి సమయంలో 'అమ్మవారికీ దండంబెట్టు అయ్యగారికీ దండంబెట్టు' అంటూ వచ్చే గంగిరెద్దులు సాక్షాత్తూ ఆ నందీశ్వరునికి వారసులు! ఇక గజాసుర సంహారాన్ని ప్రతిబింబిస్తూ తమిళనాట 'వళువుర్' అనే ప్రాంతంలో విరాటేశ్వర ఆలయం ఉంది. ఇందులో శివుడు 'గజసంహారమూర్తి'గా కనిపిస్తాడు.



# బ్రూక్ ఆటను చూస్తుంటే.. సచిన్ బ్యాటింగ్ గుర్తుకొస్తోంది : గ్రెగ్ ఛాపెల్

క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌తో ఓ యువ క్రికెటర్ ఆటను పోల్చాడు మాజీ ప్రధాన కోచ్ గ్రెగ్ ఛాపెల్. అయితే, ఆ ఆటగాడు ఇంగ్లండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్. ఈతరంలో బ్రూక్ ఆటను చూస్తుంటే.. అప్పట్లో సచిన్ బ్యాటింగ్ గుర్తుకొస్తోందని గ్రెగ్ ఛాపెల్ వెల్లడించాడు. ఇంగ్లండ్ బజ్‌బాల్ క్రికెట్‌కు సరిపోయే బ్యాటర్ బ్రూక్ అని ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రత్యర్థి బౌలింగ్‌లో విధ్వంసం సృష్టిస్తాడని తెలిపాడు. హ్యారీ బ్రూక్, సచిన్ కెరీర్ ప్రారంభాలను పోల్చి చెప్పాడు. సచిన్ కూడా మొదట్లో ఆరు లేదా ఏడు స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చేవాడని గుర్తుచేశాడు.

"ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ సెన్సేషన్. అతడిని క్రికెట్ లెజెండ్ సచిన్‌తో పోలుస్తా. ఎందుకంటే వీరిద్దరి కెరీర్ ప్రారంభ గణాంకాలు ఒకేలా ఉంటాయి. కేవలం పాతికేళ్ల వయసులోనే బ్రూక్ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నాడు. సచిన్ కూడా మొదట్లోనూ తన బ్యాటింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్నాడు. అయితే, బ్రూక్‌కు ఓ ప్రత్యేకత ఉంది. క్రీజ్‌లో మరీ ఎక్కువగా కదులుతూ ఉండడు. బంతి పడిన తర్వాత చూసి మరీ బాదుతాడు. టెక్నిక్, నిలకడైన ఆటతీరుతో బౌలర్‌ను సరిగ్గా అంచనా వేయగలడు. ఫుల్, షార్ట్ పిచ్ బంతులు వేసినా స్ట్రోక్‌తో బంతిని బౌండరీలకు పంపించేవాడు. సచిన్ కూడా బౌలర్ల పేస్‌ను తనకు అనుకూలంగా మార్చుకొని ఆడేవాడు" అని ఛాపెల్ వెల్లడించాడు. హ్యారీ బ్రూక్ 24 టెస్టుల్లో 2,281 పరుగులు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోరు 317. ఇందులో 8 సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మరోవైపు క్రికెట్ దిగ్గజం సచిన్ 1989లో టెస్టు కెరీర్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగేళ్లపాటు ఆరు లేదా ఏడో స్థానాల్లో బ్యాటింగ్ చేసేవాడు. మొదటి 14 టెస్టుల్లో లోయర్ మిడిలార్డర్‌లోనే ఆడాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీ 2025..

# భారత జట్టు ప్రకటన మరింత ఆలస్యం?



ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తుండగా.. భారత్ ఆడే మ్యాచులన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. తుది జట్టుపై బీసీసీఐ సెలక్టర్లు ఇంకా ఓ నిర్ణయానికి వచ్చినట్లు లేరు. షెడ్యూల్ ప్రకారం జనవరి 12వ తేదీ (ఆదివారం)లోగా స్క్వాడ్లను ఆయా జట్లు ప్రకటించాలి. కానీ, భారత్ మాత్రం ఇంకాస్త సమయం తీసుకొనే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. తొలుత ఇంగ్లండ్‌తో సిరీస్‌లకూ.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్లను ఎంపిక చేయాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భావించింది. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు మాత్రమే ఇవాళ లేదా ఆదివారం టీమ్‌ను ప్రకటించనుందని తెలుస్తోంది. సాయంత్రం 4 గంటలకు సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది.

ఐసీసీకి విజ్ఞప్తి..!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి కనీసం నెల రోజుల ముందే ఆయా జట్లను ప్రకటించాల్సి ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం ఐదు వారాల ముందే ప్రాథమిక జట్టును ప్రకటించి.. తర్వాత మార్పులు, చేర్పులు చేసుకొనే అవకాశాన్ని ఐసీసీ కల్పించింది. అయితే, బీసీసీఐ మాత్రం నెల రోజుల ముందే ఫైనల్ స్క్వాడ్‌ను ప్రకటిస్తామని ఐసీసీకి విజ్ఞప్తి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో జనవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ కోసం స్క్వాడ్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

మెగా టోర్నీ ప్రారంభమయ్యే కొన్ని రోజుల ముందు వరకూ.. 15 మందితోపాటు ట్రావెల్ రిజర్వ్‌గా ముగ్గురిని ఎంపిక చేయాలి. ఆ స్క్వాడ్‌లో మార్పులు చేసుకొనేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే, అందుకు ఐసీసీ అనుమతి తప్పనిసరి.

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు సెలక్ట్ అయితే..

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ స్వదేశంలో ఆడనుంది.

ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభం కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ ఆడబోయే చివరి వన్డే సిరీస్ అదే. దీంతో ఐసీసీ టోర్నీకి సన్నాహక మ్యాచ్‌ను వినియోగించుకోవాలని చూస్తోంది.

వన్డే సిరీస్‌కు ఎంపికయ్యే జట్టే.. ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగడం ఖాయమని క్రికెట్ వర్గాల విశ్లేషణ. ఒకటీ లేదా రెండు మార్పులు మాత్రమే ఉండొచ్చు. అదీనూ బుమ్రా, పంత్ వంటి ప్లేయర్లకు విశ్రాంతి ఇవ్వడం, షమీ ఫిట్‌నెస్ సాధించడం వంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్.. కేఎల్ రాహుల్ ఎంపికపై

# బీసీసీఐ యూ టర్న్!



ఆస్ట్రేలియా పర్యటన తర్వాత భారత్ టీ20, వన్డే సిరీస్‌లను ఆడేందుకు సిద్ధమవుతోంది. జనవరి 22 నుంచి ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం ఛాంపియన్స్ ట్రోఫీ 2025) ఉంది. ఐసీసీ టోర్నీకి సన్నద్ధంగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను వినియోగించుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తోంది. అయితే, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇవ్వాలని సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ విజ్ఞప్తిని బీసీసీఐ సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. తొలుత అందుకు అంగీకరించినా.. ఛాంపియన్స్ ట్రోఫీకి అంతగా సమయం లేకపోవడంతో అందర్నీ సమాయత్తం చేసేందుకు ఏ అవకాశాన్ని వదులుకోకూడదని బోర్డు భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. "మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు మొదట రెస్ట్ ఇవ్వాలని సెలక్షన్ కమిటీ భావించింది. కేఎల్ కూడా విశ్రాంతి కావాలని కోరాడు. కానీ, ఇప్పుడు బీసీసీఐ మాత్రం పునరాలోచనలో పడింది. వన్డే సిరీస్‌లో ఆడాలని కేఎల్‌ను అడిగింది. ఛాంపియన్స్ ట్రోఫీకి మ్యాచ్ ప్రాక్టీస్ అయినట్లు ఉంటుందని వివరించింది. మరి దానికి కేఎల్ అంగీకరిస్తాడో, లేదో చూడాలి" అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

షమీ రావడం ఖాయమేనా?

జాతీయ జట్టులోకి ఎప్పుడెప్పుడు వద్దామా? అని ఎదురుచూస్తోన్న క్రికెటర్ మహ్మద్ షమీ శస్త్రచికిత్స అనంతరం మోకాలిలో వాపు రావడంతో ఆసీస్ పర్యటనలకు ఎంపిక కాలేదు. దానినుంచి కోలుకున్న షమీ.. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు ఉత్సాహంగా ఉన్నాడు. అంతకుముందు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడి ఫిట్‌నెస్‌ను మళ్లీ నిరూపించుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. జాతీయ క్రికెట్ అకాడమీలోని స్పోర్ట్స్ సైన్స్ వింగ్ నుంచి అనుమతి వస్తేనే షమీని బీసీసీఐ సెలక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది.

వీరిద్దరిలో ఎవరికి అవకాశం?

వికెట్ కీపింగ్ విషయంలో సెలక్టర్లకు తలనొప్పి తప్పేలా లేదు. రిషభ్ పంత్‌కు విశ్రాంతి ఇస్తారని అనుకుంటున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ ముందు అలాంటి సాహసం చేయకపోవచ్చు. ఒకవేళ పంత్‌ను విశ్రాంతి పేరుతో పక్కనపెడితే.. వికెట్ కీపర్‌గా సంజూశాంసన్ ముందు వరుసలో ఉన్నాడు. అలాకాకుండా పంత్ ఉన్నా సంజూను బ్యాకప్‌గా తీసుకోవడం ఖాయమేనని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.



# రింకూ.. ఓ పగిలిన అద్దం!

గబెహా (దక్షిణాఫ్రికా): భారత యువ బ్యాటర్ రింకు సింగ్ సంతకం కోసం ఓ పగిలిన అద్దం ఎదురు చూస్తోంది! దీని వెనుక ఓ కథ ఉంది. 2023 దక్షిణాఫ్రికా పర్యటనలో రెండో టీ20లో రింకు 39 బంతుల్లోనే 68 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రెండు సిక్స్‌లు బాదాడు. అందులో ఓ సిక్స్ దెబ్బకు గ్రేమ్ పొలాక్ పెవిలియన్‌లోని ప్రెస్ బాక్స్ అద్దం బద్దలైంది. ఆ అద్దం పూర్తిగా ధ్వంసం కాలేదు. దీంతో ఇప్పటిదాకా కొత్త అద్దం వేయించలేదు. ఇదొక్కటే కారణం కాదు. ప్రెస్‌బాక్స్ చాలా ఎత్తులో ఉంది. దీని మరమ్మతులకు ఖర్చు అవుతుంది. ఇప్పటికే 2024లో తుపాను కారణంగా ఈ స్టేడియంలో పైకప్పులో కొంత భాగం గాలికి ఎగిరిపోయింది. మరమ్మతులు చేయించడానికి సుమారు రూ.18 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి ప్రెస్‌బాక్స్ మరమ్మతులను వాయిదా వేశారు. ఈసారి రింకు దక్షిణాఫ్రికాకు వస్తే ఆ అద్దంపై అతడి ఆటోగ్రాఫ్ తీసుకోవాలనుకుంటున్నారు. గతేడాది టీ20 ప్రపంచకప్ జరిగినప్పుడు భారత జట్టులో రింకు లేకపోవడంతో వారికి అవకాశం చేజారింది.

# పేలవ ఫామ్‌కి చెక్ పెట్టనున్న కోహ్లీ..





బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌లో 9 ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్ కోహ్లీ 190 పరుగులు మాత్రమే చేశాడు. ఈ పరాజయం నేపథ్యంలో కింగ్ కోహ్లీ ఇప్పుడు ఆధ్యాత్మిక గురువును కలిశాడు. ప్రేమానంద మహరాజ్‌ను కలిసిన తర్వాత 2023లో శ్రీలంకపై కోహ్లీ సెంచరీ సాధించాడు. కాబట్టి 2025లో కోహ్లీ మళ్లీ ఫామ్‌ని పొందగలడని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ శుక్రవారం (జనవరి 10) బృందావన్‌లోని ప్రేమానంద జీ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో కోహ్లీకి ప్రేమానంద మహరాజ్ కొన్ని ప్రత్యేక సలహాలు ఇచ్చారంట. విరుష్క జోడీ భేటీలో ప్రేమానంద మహరాజ్ సంతోషం వ్యక్తం చేస్తూ.. విజయాలతో శిఖరాగ్రంలో ఉన్నప్పటికీ మీరిద్దరూ ఆధ్యాత్మికత వైపు మళ్లడం గొప్ప విషయమని అన్నారు. పేలవ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీకి కొన్ని చిట్కాలు కూడా చెప్పారు.

క్రికెట్‌ను ఆధ్యాత్మిక సాధనగా అభివర్ణించిన ప్రేమానంద మహరాజ్.. ప్రాక్టీస్‌ను ఎప్పుడూ ఆపకూడదని కోహ్లీకి సూచించారంట. ప్రాక్టీస్‌పై కూడా ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, అప్పుడే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారంట.

అలవాటును బలపరచుకోవడం మీ కర్తవ్యంగా మారాలని, అది క్రీడే అయినా నీ ఆటతో యావత్ భారతదేశం సంతోషిస్తుందని ఆయన చెప్పారంట. అలాగే, మీ ఆచరణలో ఎటువంటి అలసత్వం ఉండకూడదని, దీనితో పాటు భగవంతుని స్మరణ కూడా చేయాలని సూచించారంట. వీటి ద్వారా పేలవమైన ఫామ్ నుంచి తిరిగి రావాలంటే కఠోర సాధన కీలకమని తెలిపారంట.

ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబర్చిన విరాట్ కోహ్లీ, సిరీస్ ముగిసిన వెంటనే ప్రేమానంద్ మహరాజ్‌ను కలిశారు. దీంతో ఫ్యాన్స్ మరోసారి కోహ్లీ పాత ఫాంలోకి వచ్చేస్తాడని భావిస్తున్నారు. అందుకు కారణం కూడా ఉందండోయ్.. ఎందుకంటే గతంలో ఈ గురూజీని కలిసిన తర్వాత కోహ్లీ అద్భుత ఫాంలో కనిపించాడని వారు భావిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. కాబట్టి ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కింగ్ కోహ్లీ నుంచి అద్భుతమైన బ్యాటింగ్‌ను ఆశించవచ్చు.

## వైడ్ బంతుల నిబంధనల్లో

# ఐసీసీ మార్పులు?



ఇప్పటివరకు బ్యాటర్లకు మాత్రమే కాస్త ప్రయోజనంగా ఉన్న వైడ్ నిబంధనల్లో మార్పులకు ఐసీసీ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. బౌలర్లకూ బెనిఫిట్ దక్కేలా మార్పులు చేయాలని అంతర్జాతీయ బోర్డు భావిస్తోందని మాజీ క్రికెటర్, ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడు షాన్ పొలాక్ వెల్లడించాడు. ప్రస్తుతం ఉన్న రూల్స్ వల్ల బౌలర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించాడు. వన్డేలు, టీ20ల్లో బౌలర్ల ఏకాగ్రతను దెబ్బకొట్టేలా బ్యాటర్లు క్రీజ్‌లో మూమెంట్స్ ఇస్తుంటారు. అలాంటప్పుడు బౌలర్ బంతిని స్టంప్స్‌కు కాస్త దూరంగా వేస్తాడు. ఇకనుంచి అలాంటి వాటిపైనా అంపైర్లు దృష్టి పెట్టనున్నట్లు పొలాక్ తెలిపాడు.

"ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడిగా నేను ఇదే అంశంపై పని చేస్తున్నా. బ్యాటర్లతోపాటు బౌలర్లకూ ప్రయోజనం కలిగేలా మారుస్తాం. ఇప్పుడున్నవి చాలా కఠినంగా ఉన్నాయి. ఒకవేళ బ్యాటర్ చివరి నిమిషంలో క్రీజ్‌లో నుంచి బయటకు వెళ్తే బౌలర్ సరైన ప్రదేశంలో బంతిని విసరలేడు. బౌలింగ్ చేసేటప్పుడు రన్నప్ నుంచే అతడు ఎక్కడ బంతిని వేయాలని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకవేళ బ్యాటర్ కదిలినప్పుడు.. బంతి దూరంగా వెళ్లిందనుకుందాం. అప్పుడు ఆ బ్యాటర్ ఎక్కడైతే ఉన్నాడో.. అక్కడి నుంచి బంతి దూరాన్ని పరిశీలనలోకి తీసుకోవాలి. అప్పుడే వైడ్‌పై ఓ నిర్ణయానికి రావాలి. నేను చూడాలనుకుంటున్న మార్పు ఇదే.

ఇది ప్రస్తుతం చర్చల్లో ఉంది. బౌలర్లకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఈమేరకు ఆలోచన చేశాం" అని పొలాక్ వెల్లడించాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్ గురించి..

తొలిసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా వెళ్లింది. జూన్‌లో లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో తలపడనుంది. బలమైన ఆసీస్‌ను ఎదుర్కోవడం సఫారీ జట్టుకు కఠిన సవాలే. ఈక్రమంలో తమ జట్టు అవకాశాలపై పొలాక్ స్పందించాడు. "దక్షిణాఫ్రికాను డబ్ల్యూటీసీ ఫైనల్ ఫేవరెట్‌గా భావించడం లేదు. మా జట్టుకు కఠిన సవాల్ తప్పదు. టెస్టుల్లో ఆసీస్ ఆటను చూసి ఈ మాట చెబుతున్నా. కానీ, క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు.

ఆ మ్యాచ్‌లో టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ చేస్తే కలిసొచ్చే అవకాశం ఉంది. ప్రత్యర్థిని ఒత్తిడికి గురి చేస్తే ఫలితం సానుకూలంగా రావొచ్చు" అని వ్యాఖ్యానించాడు.

## ఒంటి చేత్తో క్యాచ్ పట్టి..

# రూ.90 లక్షలు పట్టుకెళ్లిన ప్రేక్షకుడు



దక్షిణాఫ్రికా వేదికగా 20 లీగ్ మొదలైన సంగతి తెలిసిందే. ఐపీఎల్ మాదిరిగానే దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఈ లీక్ ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరు పొందింది. గడిచిన రెండు సీజన్లలో సన్ రైజర్స్ యాజమాన్యానికి చెందిన టీం విజయం సాధించగా.. ప్రస్తుతం మూడో సీజన్ మొదలైంది. ఈ లీగల్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ క్రికెటర్లందరూ వారి సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మామూలుగా అయితే క్రికెట్ ఆడినందుకు ఆడవాళ్లకు అలాగే సిబ్బందికి మాత్రమే డబ్బులు సంపాదిస్తుంటారు. కాకపోతే కొన్ని టోర్నీలలో ప్రేక్షకులు కూడా డబ్బులు సంపాదించే అవకాశం కల్పిస్తారు. తాజాగా మ్యాచ్ చూడడానికి వచ్చిన ఓ ప్రేక్షకుడిపై కాసుల వర్షం కురిసింది. న్యూజిలాండ్ స్టార్ బ్యాట్స్మెన్ కెన్ విలియంసన్ కొట్టిన సిక్స్ కారణంగా క్రికెట్ ప్రేక్షకుడు లక్షాధికారి అయ్యాడు.

జనవరి 9 నుండి మొదలైన ఈ లీక్ శుక్రవారం నాడు జరిగిన రెండు మ్యాచ్లో డర్బన్ సూపర్ జెయింట్స్, ప్రిటోరియా క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్ డర్బన్ వేదికగా జరగగా మొదట డర్బన్ సూపర్ జెయింట్స్ బ్యాటింగ్ చేసింది. ఈ మ్యాచ్లో కెన్ విలయంసన్ అద్భుత హాఫ్ సెంచరీతో మ్యాచ్ ను విజయ తీరాలకు చేర్చాడు. ఉత్కంఠంగా సాగిన ఈ మ్యాచ్ లో డర్బన్ సూపర్ జెయింట్స్ కేవలం రెండు పరుగులతో విజయం సాధించింది.

# బంగ్లాదేశ్‌కు ఎదురుదెబ్బ..

## క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సీనియర్ ప్లేయర్



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి బంగాళాదేశ్ సీనియర్ ఆటగాడు తమీమ్ ఇక్బాల్ పునరాగమనం చేయగలడని గత కొన్ని రోజుల ముందు ఊహాగానాలు ఉండేవి. అయితే, ఈ వెటరన్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి రావడం లేదని ప్రకటించడం ద్వారా అన్ని చర్చలకు ముగింపు పలికాడు. సోషల్ మీడియా పోస్ట్‌లో, అతను తన అంతర్జాతీయ కెరీర్‌కు అధికారికంగా వీడ్కోలు చెప్పాడు. బంగ్లాదేశ్ క్రికెట్ స్టార్ తమీమ్ ఇక్బాల్ 35 ఏళ్ల వయస్సులో తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ముగిసిందని ప్రకటించారు. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన తన సందేశంలో, తమీమ్ "నేను చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్నాను. ఈ గ్యాప్ ఇక పూర్తికావడం లేదు. నేను చాలా కాలంగా నా భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాను. ఈ రోజు నా అంతర్జాతీయ క్రికెట్ అధ్యాయం ముగిసింది" అని ఆయన రాసుకొచ్చారు. తమీమ్ ఈ నిర్ణయం తీసుకోవడానికి తన సమయాన్ని వెచ్చించుకున్నానని, నా గురించిన చర్చతో జట్టు దృష్టి మరల్చకూడదని ఆయన వెల్లడించారు.

తమీమ్, 2023 ప్రపంచ కప్‌కు ముందు జట్టు నుండి తప్పించబడినందుకు షాక్ అనిపించిందని వెల్లడించారు. ప్రతి చోటా అభిమానులు నన్ను జాతీయ జట్టులో తిరిగి చూడాలని కోరుకుంటున్నారని, వారి ప్రేమకు నేను చాలా కృతజ్ఞతలు అని అన్నారు. ఇకపోతే, బంగ్లాదేశ్ తరఫున 243 వన్డే మ్యాచ్‌లు ఆడిన తమీమ్ ఇక్బాల్ 240 ఇన్నింగ్స్‌లలో 8357 పరుగులు సాధించాడు. ఇందులో 14 సెంచరీలు, 56 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అదే సమయంలో, అతను 70 టెస్ట్ మ్యాచ్‌లలో 134 ఇన్నింగ్స్‌లలో 5134 పరుగులు చేశాడు. ఇందులో 10 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అలాగే 78 టీ20ల్లో 1758 పరుగులు చేశాడు.

# 'డాకు మహారాజ్' తో మరో విజయం : బాలకృష్ణ



'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందినిచౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, "తిరుమల తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. బాధాకర ఘటన చోటు చేసుకోవడంతో అనంతపురంలో తలపెట్టిన వేడుకను రద్దు చేయడం జరిగింది. నా అభిమానులు క్రమశిక్షణ కలిగిన సైనికులు. అందుకే వారు మా నిర్ణయాన్ని స్వాగతించారు. ఇన్ని లక్షల, కోట్ల మంది అభిమానులను పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ముందుగా నాకు జన్మనిచ్చి, నన్ను ఆయన ప్రతిరూపంగా మీ హృదయాల్లో నిలిపిన దైవాంశ సంభూతులు, నా తండ్రి, నా గురువు, నా దైవం నందమూరి తారక రామారావుకి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నాన్న వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, ఆయన మాదిరిగానే ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించుకుంటూ వస్తున్నాను. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే అప్పట్లో 'ఆదిత్య 369'లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి ఈ 'డాకు మహారాజ్' కథ పుట్టింది. తాజాగా విడుదల చేసిన రిలీజ్ ట్రైలర్ కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. బాలకృష్ణ నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఏం కోరుకుంటారో అందుకు తగ్గట్టుగా ఈ ట్రైలర్ ఉంది. దర్శకుడు బాబీ ఆలోచనకు తగ్గట్టుగా, కెమెరామెన్ విజయ్ కన్నన్ తన అద్భుత పనితీరుతో సన్నివేశాలకు ప్రాణం పోశారు. తమన్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మూడు వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకముంది. ఇక ముందు కూడా ఇలాగే మరిన్ని మంచి సినిమాలతో మీ ముందుకు వస్తున్నాను అందరికీ సంక్రాంతికి శుభాకాంక్షలు" అన్నారు.



## సర్‌ప్రైజింగ్ క్లైమాక్స్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం'

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్‌లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరో విక్టరీ వెంకటేష్ విలేకరుల సమావేశంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విశేషాల్ని పంచుకున్నారు.

**సంక్రాంతికి వస్తున్నాం కోసం ఎంత ఎక్సయిటెడ్‌గా వున్నారు ?**

నా కెరీర్ ఇది మరో సంక్రాంతి. ఒక క్లీన్ ఎంటర్ టైనింగ్ ఫిల్మ్ తో రావడం చాలా ఆనందంగా వుంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్ న్యూ జానర్ కూడా వుంది. సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. అంతా పాజిటివ్‌గా వుంది. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన మోస్ట్ ఫిలిమ్స్ చాలా బాగా ఆడాయి. ఈ సినిమా కూడా అద్భుతంగా ఆడుతుందనే నమ్మకం వుంది.

**ఈసారి ప్రమోషన్స్ చాలా ఎనర్జిటిక్ గా చేయడానికి కారణం ?**

ఇది నేచురల్‌గా జరిగింది. మ్యూజిక్ చాలా నచ్చింది. నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. కొన్ని మ్యూజిక్ ట్యూన్స్ వినగానే క్రేజీగా అనిపించింది. అలాగే డైరెక్టర్ అనిల్, ఇద్దరు హీరోయిన్స్.. లైవ్లీ టీం కుదిరింది. ప్రమోషన్స్‌లో ఏదైనా కొత్తగా చేయాలని అనుకున్నాం. ప్రమోషన్స్ ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేయడం హ్యాపీగా వుంది.

**మీతో సాంగ్ పాడించాలనే ఆలోచన ఎవరిది ?**

నైట్ రెండు గంటలకి ఆ సాంగ్ విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఏదో క్రేజీ ఎనర్జీ ఆ సాంగ్ లో వుంది. సరదాగా నేనే పాడతానని అన్నాను. ఆ రోజు గొంతు బాగానే వుంది. ఇంగ్లీష్ వర్డ్స్ వుండటంతో నాకు ఇంకా ఈజీ అయ్యింది(నవ్వుతూ). ఇందులో రమణ గోగుల పాడిన పాట పెద్ద హిట్ అయ్యింది. చాలా గ్యాప్ తర్వాత ఆయన నా సినిమాకి పాడారు. పాటకు అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఆనందంగా వుంది.

**'సంక్రాంతికి వస్తున్నాం' కథ విన్నప్పుడు మిమ్మల్ని ఎక్సయిట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి ?**

ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. మినిమం గ్యారెంటీ అని అక్కడే తెలిసిపోయింది. అనిల్ నాది సూపర్ హిట్ కాంబినేషన్. మేము చాలా ఫ్రెండ్లీగా వుంటాం. పెర్ఫార్మెన్స్ వైజ్ ఇందులో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్‌గా వుంటుంది. చాలా షటిల్‌గా కొత్తగా ట్రై చేశాం. ఫ్రెష్ సీన్స్ వుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. అనిల్ తో మంచి రేపో కుదిరింది. తనతో మూవీస్ కంటిన్యూ చేయాలని వుంది.

## కల్పవ వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ సర్వీసెస్ ను ప్రారంభించిన

సినిమా ఇండస్ట్రీలోకి వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. ఫిల్మ్ మేకర్స్ అంతా టెక్నాలజీని ఉపయోగిస్తూ వండర్స్ క్రియేట్ చేస్తున్నారు. తాజాజా హైదరాబాద్‌లో కల్పవ వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ టెక్నాలజీ తమ నూతన బ్రాంచ్‌ను హైదరాబాద్‌లో లాంచ్ చేశారు డాక్టర్ మల్లీశ్వర్. ఈ వేడుక శుక్రవారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు, దర్శకులు శ్రీనువైట్ల, కరుణ కుమార్, ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ డైరెక్టర్ వందన, నటులు విక్రాంత్ రెడ్డి, రఘు కుంచె హాజరయ్యారు.




మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ 'మన తెలుగు బిడ్డ మల్లీశ్వర్ అమెరికాలో స్థిరపడి ఎంటర్‌పెన్యూర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక్కడి నిరుద్యోగ యువతికి ఉద్యోగాలు ఇప్పించాలని నేను ఆహ్వానించగానే సిద్ధిపేటలో ఐటీ కంపెనీ పెట్టి ఎంతోమంది గ్రామీణ యువతకు ఉద్యోగాలు ఇచ్చిన డాక్టర్ మల్లీశ్వర్ ని అభినందించాలి. మన తెలుగు చిత్ర పరిశ్రమ బాలీవుడ్, హాలీవుడ్‌తో పోటీ పడుతుంది. రాబోయే కాలంలో హాలీవుడ్‌తో మరింత పోటీని ఎదుర్కొవాలంటే.. ఇలాంటి వీఎఫ్ఎక్స్, ఏఐ టెక్నాలజీ చాలా అవసరం. సినిమా బడ్జెట్‌ను తగ్గిస్తూ.. విజువల్ ఎఫెక్ట్స్‌ను పెంచుతూ ప్రేక్షకులు అట్రాక్ట్ చేయాలంటే ఈ టెక్నాలజీ అవసరం ఉంది. ప్రస్తుతం ప్రపంచమంతా ఏఐ వెంట పరుగెడుతుంది. అమెరికా నుంచి ఇండియా వచ్చి ఇది స్థాపించిన మల్లీశ్వర్ ఇంకా ఎదగాలని, చిత్ర పరిశ్రమ ఎదుగుదలకు తనవంతు కృషి చేయాలని కోరుతున్నా. ఆర్ఆర్ఆర్ లాంటి చిత్రానికి ఆస్కార్ వచ్చిందంటే తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వ కారణం. ఇలాంటి టెక్నాలజీని తెలుగు పరిశ్రమకు రావడం అభినందనీయం' అని అన్నారు. దర్శకులు శ్రీనువైట్ల మాట్లాడుతూ 'మల్లీశ్వర్ మంచి ఆలోచనతో వీఎఫ్ఎక్స్‌తో పాటు ఏఐ బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

## శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న స్ప్లాష్ కలర్స్ మీడియా



స్ప్లాష్ కలర్స్ మీడియా, అలీనియ అవిజ్ఞ స్టూడియోస్ సెటిల్ కింగ్ ప్రొడక్షన్ నెం:1లో వేణుబాబు నిర్మాతగా ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో పవన్ చరణ్, జీవీ సంగీ తాన్ని అందిస్తూ దిలీప్ కుమార్ చిన్నయ్య సినిమా ఆటోగ్రాఫర్‌గా పనిచేస్తూ సినిమా త్వరలో ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ చిత్రంలో ఆదర్శ్ పుండిర్, అశ్రీత్ రెడ్డి, ప్రియాంక సింగ్, పూజిత పుండిర్, రాజ్‌గౌడ్, సునందిని, మధుసూదన్ తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతూ అండగా త్వరలోనే ఇతర సినిమా అప్డేట్లతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నటి ప్రియాంక సింగ్ మాట్లాడుతూ... "నేను ఈ నిర్మాణ సంస్థలో పనిచేయడం మొదటిసారి. జీవి విశ్వనాథ్ గారి దర్శకత్వంలో పనిచేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడైన జీవి మొదటిసారి దర్శకత్వం చేస్తున్నారు. నాకు చాలా మంచి క్యారెక్టర్ ఇచ్చారు. నా క్యారెక్టర్ అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను. ఈ రోజుల్లో ఇటువంటి సినిమాలు రావడం లేదు. కాబట్టి ఈ సినిమా ఎంతో స్పెషల్‌గా ఉండబోతుంది. అందుకుగాను ఈ చిత్రాన్ని అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను. ఈ చిత్రంలో నటిస్తున్న తోటి నటీనటులతో, ఈ చిత్ర బృందంతో పనిచేయడం అనేది నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నారు.


## 'రామాయణ' ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ ట్రైలర్

రామాయణ ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ సినిమా ట్రైలర్ భారీ అంచనాల నడుమ తాజాగా విడుదలైంది. భారత దేశం లో రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వాల్మీకీ రామాయణం గురించి అనేక సినిమాలు వచ్చినా, ఇది ప్రత్యేకం అని చెప్పుకోవచ్చు. నేడు విడుదలైన ట్రైలర్‌లో, విజువల్స్ చాలా బాగున్నాయి. యుద్ధం సన్నివేశాలు చూస్తే, ఆ రోజుల్లో అయోధ్య లో జరిగిన ఘట్టాలన్నీ మన కళ్ళ ముందు కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్రైలర్ లో చూపించిన అయోధ్య, మిథిలా నగరాలూ, పంచవటి అడవి ప్రాంతం, సీతా రాములు అరణ్యవాసం చేసిన ప్రదేశాలు మొదలగునవి అన్నీ సహజంగా ఉన్నాయి. జపనీస్ యానిమే స్టైల్ లో ఈ ట్రైలర్ ని రూపొందించడం జరిగింది. యుగో సాకో, కోయిచి ససకి మరియు రామ్ మోహన్ లు అందరూ కలిసి ఈ సినిమా ని మన ముందుకు తీసుకొస్తున్నారు. దాదాపుగా 450 ఆర్టిస్ట్స్, ఒక లక్ష మంది హ్యాండ్ డ్రాన్ సేల్స్ ద్వారా ఈ విజువల్ మాస్టర్ పీస్ ని రూపొందించారు.




## 'హిసాబ్ బరాబర్' ట్రైలర్

వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న ప్రముఖ ఓటీటీ జీ5 నుంచి మరో ఆసక్తికరమైన సినిమా రానుంది. అదే 'హిసాబ్ బరాబర్'. విలక్షణ నటుడు ఆర్.మాధవన్ ఇందులో ప్రధాన పాత్రలో నటించగా నీల్ నితిన్, కీర్తి కుల్హారి ఇతర పాత్రల్లో మెప్పించనున్నారు. జీ5లో జనవరి 24 నుంచి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రీమియర్‌కు సిద్ధమైందీ చిత్రం. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. ఓ బ్యాంక్ చేసే చిన్న పొరపాటు ఓ వ్యక్తి జీవితాన్ని తలక్రిందులు చేస్తే ..అతనెలా స్పందించాడు. న్యాయం కోసం అతను ఎలాంటి పోరాటం చేశాడనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. ఆర్థికపరమైన మోసం, అవినీతి, న్యాయం కోసం చేసే పోరాటం ఇవన్నీకథలో భాగంగా మిళితమై ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నాయి. విలక్షణ నటుడు ఆర్.మాధవన్, నీల్ నితిన్,కీర్తి కుల్హారి తదితరులు వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. ప్రేక్షకులు మెచ్చేలా చక్కటి డ్రామా, కామెడీ, సామాజిక అంశాలతో.. అశ్విన్ ధీర్ దర్శకత్వంలో జియో స్టూడి యోస్, ఎస్?పి సినీకార్ప్ ఈ చిత్రాన్ని నిర్మించాయి. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో చిరు ఉద్యోగి అయిన రాధే మోహన్ శర్మ పాత్రలో మాధవన్ మనకు ఇందులో కనిపిస్తారు.



## 'డాకు మహారాజ్'లో కొత్త బాలకృష్ణని చూస్తారు



వరుస ఘన విజయాలతో దూసు కుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్' చిత్రంతో అలరించనున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీడియోల్, ఊర్వశిరౌతేలా, చాందినిచౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడి యాతో ముచ్చటించిన దర్శకుడు బాబీ కొల్లి, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**'డాకు మహారాజ్' ఎలా ఉండబోతుంది?**

బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకొని 'డాకు మహారాజ్' సినిమా చేయడం జరిగింది. అయితే బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించాము. బాలయ్య సెటిల్డ్‌గా డైలాగ్‌లు చెప్తే చాలా బాగుంటుంది. 'నరసింహానాయుడు', 'సమర సింహారెడ్డి' తర్వాత 'సింహా' ఎలా అయితే గుర్తుండే సినిమా అయిందో.. డాకు మహారాజ్ కూడా అలాంటి పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది. చాలా నిజాయితీగా కథను చెప్పాము.

**బాలకృష్ణ గురించి?**

బాలకృష్ణ నుంచి ఎవరైనా క్రమశిక్షణ నేర్చుకోవచ్చు. దర్శకుడికి ఎంతో గౌరవం ఇస్తారు. సెట్స్ లో అందరితో సరదాగా ఉంటారు. మనం ఎంత నిజాయితీగా ఉంటే బాలకృష్ణ గౌరవిస్తారు. అభిమానులు తనను చూడటానికి వస్తారు కదా అని, డూప్ లేకుండా నటించడానికి ఇష్టపడతారు. మొండి గు ర్రాన్ని సైతం కంట్రోల్ చేస్తూ, స్వయంగా స్వారీ చేసి మమ్మల్ని ఆశ్చర్యపరిచారు.

**ట్రైలర్‌లో విజువల్స్ కి మంచి పేరు వచ్చింది కదా. ఎలాంటి కేర్ తీసుకున్నారు?**

నిర్మాత నాగవంశీ బాలకృష్ణని ఎంతో అభిమానిస్తారు. ఆ అభిమానంతోనే తమ బ్యానర్‌లో వచ్చే సినిమా వైవిధ్యంగా ఉండాలి అనుకున్నారు. అలాగే ఒక దర్శకుడిగా నాకెంతో ఫ్రీడమ్ ఇచ్చారు. ఇద్దరం కలిసి ఈ సినిమాలో విజువల్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడేలా చేయాలి అనుకున్నాము. డీఓపీ విజయ్ కన్నన్‌తో నాకు ముందే పరిచయముంది. అప్పుడు ఆయన జైలర్ సినిమాకి పని చేస్తున్నారు. నాగవంశీ కూడా విజయ్ పేరు చెబితే వెంటనే ఓకే అని, ఆయనతో మాట్లాడారు. అలా విజయ్ ఈ సినిమాలో భాగమయ్యారు. ఆయన ఎంతో అంకిత భావంతో పని చేస్తారు. కథను ఓన్ చేసుకుంటారు. అందుకే విజువల్స్ అంత అద్భుతంగా వచ్చాయి.

**సినిమా ఉపయోగించిన ఆయుధాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టున్నారు?**

హీరోకి ఆయుధం అనేది కీలకం. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో గొడ్డలి వంటి పవర్ ఫుల్ ఆయుధం బాగా ఫేమస్. ఈ సినిమాలో ఆలాంటి శక్తివంతమైన ఆయుధం ఉండాలి, కానీ అది కొత్తగా ఉండాలి అనుకున్నాము. అందుకు తగ్గట్టుగానే ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ అద్భుతమైన ఆయుధాలను డిజైన్ చేశారు.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044